



మాట్లాడుతున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

మరో సారి మొండిచేయి..!

- కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు శూన్యం
- వేతన జీవులకూ నిరాశే

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కేంద్ర బడ్జెట్ జిల్లాకు మొండిచేయి చూపించింది. జిల్లా ప్రాజెక్టుల ప్రస్తావన ఎక్కడా కనిపించలేదు. జిల్లాకు కేటాయింపులు శూన్యంగానే కనిపించాయి. రైల్వే జడ్జెట్‌లోనూ జిల్లాకు కేటాయింపులు దక్కలేదు. చివరికి వేతన జీవులకూ నిరాశే మిగిలింది...

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 2023-24 బడ్జెట్‌ను బుధవారం రూ.45 లక్షల కోట్లతో ప్రవేశపెట్టారు. చట్టబద్ధమైన హామీలను విస్మరించి ప్రయివేటీకరణ పేరుతో కార్పొరేట్ల భజన చేసింది. ఎంఎస్ఎంఇలకు ప్రోత్సాహకాలు, అద్దె వ్యవసాయ పనిముట్లు, ప్రకతి వ్యవసాయాన్ని ఉటంకించింది. ఫలితంగా ఉద్యోగులకు నిరాశే మిగిలింది. బడా పారిశ్రామిక వేత్తలకు లబ్ధి చేకూరేలా బడ్జెట్ ఉంది. గ్రామీణ పేదల ఊసే లేదు. గ్రామీణ ఉపాధి హామీ, గ్రామీణ పేద కార్మికులు, ఉద్యోగాలు, ద్రవ్యోల్బణం ఊసే లేదని కేంద్ర బడ్జెట్లో జిల్లాలోని ప్రాజెక్టుల ప్రస్తావనే కరువైంది. జిల్లాలోని పెండింగ్ రైల్వే ప్రాజెక్టుల కేటాయింపుల అతీ గతీ లేదు. రంగాల వారీగా పద్దులు ప్రకటించడం మినహా స్పష్టత కరువైంది. రాష్ట్ర విభజన జరిగి ఏడేళ్లు గడిచిన నేపథ్యంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధుల విడుదల జాడే కనిపించలేదు.

రైల్వేపై చిన్నచూపు..

రైల్వే ప్రాజెక్టులపై కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో చిన్నచూపు చూసింది. కేంద్ర బడ్జెట్‌లో రైల్వేకు రూ.2.40 లక్షల కోట్లు కోటాయించగా వాటిలో కొత్త రైళ్లు, కొత్త రైల్వే లైన్లకు ఒక్క పైసా కూడా కేటాయించలేదు. కర్నూలు సిటీ రైల్వే స్టేషన్ నుంచి విజయవాడ మీదుగా మచిలీపట్నం వరకూ రైలు ఉన్నప్పటికీ అది రెండు రోజులకు ఒకసారి నడుస్తోంది. దాన్ని రోజూ నడపాలన్న డిమాండ్ ప్రజల నుంచి వ్యక్తం అవుతోంది. కాచిగూడ నుంచి గుంటూరుకు నడిచే ఎక్స్‌ప్రెస్ రైలును విజయవాడ వరకూ పొడిగించాలన్న ప్రజల ఆకాంక్ష నెరవేరలేదు. కర్నూలు నుంచి నంద్యాలకు వెళ్లాలంటే డోన్ మీదుగా వెళ్లాల్సి వస్తుండటంతో సమయం ఎక్కువ పడుతోంది. కర్నూలు నుంచి ఓర్వకల్లు, పాణ్యం మీదుగా నంద్యాలకు కొత్తగా రైల్వే లైన్ వేస్తే ప్రయాణ సమయం తగ్గిపోనుంది. జిల్లాలోని పుణ్యక్షేత్రాలను కలిపేలా మంత్రాలయం - కర్నూలు - శ్రీశైలం కొత్త రైల్వే లైన్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఎన్నో ఏళ్లుగా ఉంది. అయితే బడ్జెట్‌లో వీటి ప్రస్తావన ఏ మాత్రం లేకుండా పోయింది.



కోచ్ ఫ్యాక్టరీకి శూన్యం..

కర్నూలు సమీపంలో ఏర్పాటు చేయనున్న రైల్వే కోచ్ తయారీ ఫ్యాక్టరీకి కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు శూన్యమే. మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని ఆలంపూర్ రోడ్డు, కర్నూలు జిల్లా పరిధిలోని ఇ.తాండ్రపాడు, పంచలింగాల పరిధిలో ఈ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. రూ.562 కోట్లతో 123 ఎకరాల్లో దాని ఏర్పాటు పనులను ప్రారంభించారు. అవసరమైన స్థాయిలో నిధులు కేటాయించకపోవడంతో ఈ రైల్వే కోచ్ ఫాక్టరీ పనులు ముందుకు సాగడం లేదు.

ట్రిపుల్ ఐటి డిఎం ప్రస్తావన మాత్రమే..

జిల్లాలోని ఐఐఐటి డిఎంను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని కేంద్ర బడ్జెట్‌లో పేర్కొన్నా నిధుల కేటాయింపుల విషయంలో స్పష్టత కొరవడింది. ఆ సంస్థ స్థాపించినప్పటి నుంచి కేంద్ర బడ్జెట్‌లో ఇదే మాట చెబుతున్నా అభివృద్ధికి నిధులు మాత్రం కేటాయించడం లేదు.

సీమకు నష్టం కలిగించే బడ్జెట్

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్



కేంద్ర బడ్జెట్ రాయలసీమ ప్రాంతానికి తీరని నష్టం కలిగించే విధంగా ఉంది. ఈ బడ్జెట్ రాబోయే కాలంలో ఎన్నికల్లో లబ్ధి చేకూర్చేందుకు ఉపయోగపడేలా కేటాయింపులు ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రానికి ప్రత్యేక నిధులు కేటాయింపులోనే చాలా స్పష్టంగా ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసం అనేది అర్థమవుతుంది. కర్ణాటకలో అప్పరభద్ర ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి నిధులు కేటాయించింది. ఇప్పటికే కరువు కాటకాలతో అల్లాడుతున్న రాయలసీమకు తీరని నష్టం జరిగే ప్రమాదం ఉంది. అప్పరభద్ర ప్రాజెక్టు నిర్మిస్తే కర్నూలు, అనంతపురం, కడప జిల్లాలో ఎల్ఎల్‌సి, హెచ్ఎల్‌సి, కెసి. కెనాల్ ద్వారా ఉన్న ఆయకట్టు భూములకు నష్టం జరిగే అవకాశం ఉంది. ఉపాధి హామీ చట్టానికి రూ.89 వేల కోట్ల నుండి 60 వేల కోట్లకు తగ్గించింది. ఆహార భద్రతకు రూ. రెండు లక్షల 87 వేల కోట్ల నుండి లక్ష 97 వేల కోట్లకు కుదించి గ్రామీణ పేదలకు తీవ్రమైన ద్రోహం చేసింది. ఇప్పటికే పనులు లేక వలసలు వెళుతున్న కర్నూలు జిల్లా ప్రజలకు ఉపాధి హామీ పథకానికి బడ్జెట్లో కేటాయింపులు తగ్గించడం వల్ల రాబోయే కాలంలో వలసలు పెరిగే అవకాశం ఉంది. వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు ఏమాత్రం కేటాయించకపోవడం దుర్మార్గం.

కేంద్ర బడ్జెట్ రాష్ట్ర ప్రజలకు తీరని అన్యాయం

- సోమిశెట్టి వెంకటేశ్వర్లు టిడిపి కర్నూల్ పార్లమెంట్ అధ్యక్షులు



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మొండి చెయ్యి చూపింది. కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం నోరు మెదపలేని స్థితిలో ఉంది. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎంతో ప్రాధాన్యత ఉంటుందని ఎదురుచూసిన అనేక రంగాలకు నిరాశే కనిపించింది. మోడీ ప్రభుత్వానికి ఆంధ్ర రాష్ట్రంపై కపట ప్రేమ ఉందని ఈ బడ్జెట్ తో నిరూపితమైంది. కేంద్ర బడ్జెట్ ను అన్ని వర్గాల ప్రజలు ఆక్షేపిస్తున్నారు.

రాష్ట్రానికి మొండి చేయి

- బి.గిడ్డయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి.



కేంద్రం బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చేయి చూపించారు. రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్రానికి ఇచ్చిన హామీలు గాని ప్రత్యేక హోదా గాని ఏవి ప్రకటించలేదు. కొన్ని రాష్ట్రాలలో జరుగుతున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బడ్జెట్‌ను కేటాయించడం అంకెల గారడీగా ఉంది. రసాయనికి ఎరువులపై ఇస్తున్న సబ్సిడీని తగ్గించడం బాధాకరం. కర్నూలు జిల్లా విభజన అనంతరం జిల్లాలో రైల్వే వ్యాగన్, క్షామ ప్రాంతంగా ఉన్న పశ్చిమ పీడిత ప్రాంతం నుండి ప్రజలు వలసలు వెళ్లకుండా ఆ ప్రాంత ప్రాజెక్టులకు నిధులు కేటాయించలేదు.

విచక్షణాత్మక బడ్జెట్

- ఆచార్య షేక్ మన్సూర్ రహమాన్, ఆర్థిక వేత్త.



రాష్ట్రంలో 14 వెనుకబడిన జిల్లాలు ఉంటే రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కర్ణాటకలోని కరువు ప్రాంతాలకు రూ.5 వేల కోట్లు కేటాయించడంతో ఇది విచక్షణాత్మక బడ్జెట్‌గా మారింది. ప్రత్యక్ష, పరోక్ష పన్నుల రూపంలో కేంద్ర ప్రభుత్వానికి ఆదాయాన్ని ఇస్తున్న దక్షణాది రాష్ట్రాలకు కేటాయింపులు శూన్యం. ఉద్యోగస్తులకు చూపిన ఆదాయపు పన్ను ఊరట ఒకమాయ. స్లాబ్ విధానాన్ని సవరించక కొత్త ఆదాయ పన్ను విధానాన్ని ప్రకటించడం ద్వారా ప్రయోజనం పొందే ఉద్దేశం కనిపిస్తుంది కాని ఒరిగిందేమీ లేదు. రాష్ట్ర విభజన తర్వాత వచ్చిన 9వ కేంద్ర బడ్జెట్లో కూడా రాష్ట్రానికి సహాయం ఊసేలేదు. కోవిడ్ మహమ్మారి కారణంగా దెబ్బతిన్న రాష్ట్రాలు, రంగాల గురించిన ప్రస్తావన లేదు. ఆర్థిక వ్యవస్థలో కీలకంగా ఉన్న సేవారంగం కూడా బడ్జెట్‌లో ప్రాధాన్యత పొంద లేదు. మైనారిటీలు, అణగారిన వర్గాల సంక్షేమం మరచి పోయారు.

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి మొండి చెయ్యి

- సుధాకర్ బాబు, డిసిసి అధ్యక్షుడు



కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ మొత్తం ఎన్నికల బడ్జెట్ గానే ఉంది. ఎన్నికల జరుగుతున్న ప్రాంతాలకు నిధుల కేటాయింపు చేసిన కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీ కానీ వెనుకబడిన ప్రాంతాల అభివద్ధి కింద రాయలసీమకు నిధుల కేటాయింపులో మొండి చెయ్యి చూపింది. ఈ బడ్జెట్ ప్రజా వ్యతిరేక బడ్జెట్.

వ్యవసాయ రంగానికి కేటాయింపుల కుదింపు

- పోతుల శేఖర్ రైతు స్వరాజ వేదిక కన్వీనర్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో వ్యవసాయ రంగానికి, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి, మొత్తం వ్యవసాయ రంగాలకు బడ్జెట్ కేటాయింపులు తగ్గిపోయాయి. పీఎం కిసాన్ పథకానికి నిధులు తగ్గాయి. ఉపాధి హామీ పథకానికి 18 శాతం తగ్గిపోయాయి. రాష్ట్రీయ కృషి వికాస్ పథకానికి బడ్జెట్ తగ్గించారు. రైతులకు కనీసం మద్దతు ధరలు అందించే పథకాలకు నిధులు పూర్తిగా రద్దు చేశారు.

అత్యాధునిక టెక్నాలజీతో

నేర నియంత్రణ

- శిక్షల శాతం పెంచి బాధితులకు న్యాయం
- నేర సమీక్షలో ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

ఆత్యాధునిక సాంకేతిక విధానాలతో నేరాలను నియంత్రించేందుకు పోలీసులు కృషి చేయాలని జిల్లా ఎస్‌పి సిద్ధార్థ కౌశల్ అన్నారు. బుధవారం కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలో డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలతో ఆయన నేర సమీక్షా సమావేశం నిర్వహించి పోలీసు అధికారులతో మాట్లాడారు. నేర రహిత సమాజంగా తీర్చిదిద్దాలంటే నిందితులకు కోర్టులో శిక్ష పడే విధంగా పోలీసు అధికారులు , సిబ్బంది కృషి చేయాలన్నారు. శిక్షల శాతం పెంచి బాధితులకు న్యాయం జరిగేలా చేయాలన్నారు. ఎఫ్ఐఆర్ నమోదు అయినప్పటీ నుంచి కేసు పూర్తయ్యేంత వరకు నిందితుల నేరాలను నిరూపించేందుకు అవసరమైన రుజువులు, పత్రాలు, సాక్షుల విచారణ, వాంగ్మూలం కోర్టుకు సమర్పించడంలో కోర్టు, పోలీస్ అధికారులు పనితీరులో వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలన్నారు. నేరస్తులకు వారంట్స్, సమన్స్, సత్వరమే ఎగ్జిక్యూటివ్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నేరస్తులకు కోర్టులో కఠిన శిక్షణలు పడితే, బాధితులకు న్యాయవ్యవస్థ, పోలీసుశాఖపై నమ్మకం, గౌరవం పెరుగుతుందన్నారు. కోర్టులో కేసులు వీగిపోకుండా శ్రద్ధ తీసుకోవాలని, బలమైన వాదనలు వినిపించి బాధితులకు న్యాయం జరిగేవిధంగా చూడాలన్నారు. ప్రతీ కేసులో ఖచ్చితమైన దర్యాప్తు (క్వాలిటీ ఇన్వెస్టిగేషన్) ఉండాలన్నారు. గ్రేవ్, నాన్‌గ్రేవ్, కేసుల్లో సాక్షులను మోటీవేట్ చేయాలన్నారు. సెన్సెషనల్ కేసుల్లో త్వరగా పరిశోధన పూర్తిచేసి చార్జీషీట్ దాఖలు చేయాలన్నారు. పెండింగ్ ట్రయల్ కేసులను త్వరగా పరిష్కరించాలన్నారు. గ్రామ సందర్శనలు, పల్లె నిద్రలు, ఫ్యాక్షన్, లా అండ్ ఆర్డర్, ఇతర సమస్యలను నివారించడానికి ఇప్పటివరకు తీసుకున్న చర్యలు గురించి, గుర్తించిన గ్రామాలలో సిసి కెమెరాల సంస్థాపన పురోగతి గురించి ఆరా తీశారు. కర్నూలు, పత్తికొండ , ఆదోని సబ్ డివిజన్‌లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న యుఐ కేసులు, గ్రేవ్ కేసుల గురించి జిల్లా ఎస్పి సమీక్షించారు. రాబోయే రోజుల్లో ఆధునిక టెక్నాలజీ ఉపయోగించి నేరాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. ఆధునిక టెక్నాలజీ గురించి జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో పోలీసు అధికారులకు, సిబ్బందికి శిక్షణ ఇప్పించి నిష్ణాతులను చేస్తామన్నారు. ప్రతి కేసులో దర్యాప్తు త్వరగా చేయాలన్నారు. క్రిమినల్ కేసులు, పట్టదగిన నేరాలు, రోడ్డు ప్రమాదాల కేసులు, రేప్ కేసులలో దర్యాప్తులు జాగ్రత్తగా చేయాలన్నారు. నిజాయితీగా పని చేయాలన్నారు. టెక్నాలజీని బాగా ఉపయోగించి పకడ్బందీగా ఆధారాలు సేకరించాలన్నారు. అడిషనల్ ఎస్‌పి అడ్మిన్ డి.ప్రసాద్, లీగల్ అడ్వయిజర్ మల్లికార్జున రావు, డిఎస్‌పిలు వెంకటాద్రి, వెంకట్రామయ్య, యుగంధర్ బాబు, శ్రీనివాసులు, వినోద్‌కుమార్, కెవి.మహేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర రగ్బీ ఫైనల్స్‌కు ప్రకాశం, కర్నూలు...

ప్రజాశక్తి-కర్నూలు స్పోర్ట్స్

రాష్ట్రస్థాయి అండర్ 14బాల బాలికల రబ్బీ పోటీలలో బాలుర విభాగంలో ప్రకాశం, కర్నూలు జిల్లాల జట్లు, బాలికల విభాగంలో ప్రకాశం, కడప జిల్లాల జట్లు ఫైనల్ పోటీకి చేరాయి. బుధవారం నగరు శివారులోని ఆదర్శ విద్యా మందిరంలో జరిగిన బాలబాలికల క్వార్టర్ ఫైనల్, సెమీఫైనల్ పోటీల ఫలితాల వివరాలను స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జోసఫ్ లక్ష్మయ్య తెలిపారు. బాలుర విభాగం సెమీఫైనల్ పోటీలో కర్నూలు జట్టు కడప జిల్లా జట్టుపై 6-2 స్కోరుతో విజయం సాధించగా మరో పోటీలో ప్రకాశం జిల్లా జట్టు విశాఖపట్నం జిల్లా జట్టుపై 4-2స్కోర్ తో గెలిచి ఫైనల్స్ పోటీకి చేరాయి. బాలికల విభాగంలో కడప జట్టు శ్రీకాకుళం జిల్లా జట్టుపై హోరాహోరీగా పోరాడి మూడు ..2 మూడు .. 2స్కోర్ తో గెలవగా ప్రకాశం జిల్లా జట్టు కృష్ణాజిల్లా జట్టుపై నాలుగు... 2 స్కోర్‌తో గెలిచి ఫైనల్స్‌కు చేరాయి.





ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న పిపిఎస్ఎస్ నాయకులు ఇ. పుల్లారెడ్డి, తదితరులు

రోడ్లు ముగురు కాలువలు లేవు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఖాళీ స్థలాల్లో కంపచెట్లు పెరిగి అందులో మురికి నీరు నిలిచి పాములకు పందులకు నిలయంగా మారిందని కెఆర్ఆర్ కాలనీ పేద ప్రజలు పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందానికి తెలిపారు. తాగేందుకు మంచినీళ్లు పక్క వీధిలో తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా పట్టణ పౌరసంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి పి.ఇక్బాల్, ఎ.వెంకటేశ్వర్లు, టి.హరికృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర. కేంద్ర ప్రభుత్వాలు ప్రతి వస్తువుపై పన్ను లేస్తూ పేద ప్రజలకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయడంపై శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వివిధ పథకాల కింద వచ్చిన నిధులు ఇలాంటి కాలనీలో వెచ్చించి రోడ్లు కాలువలు నిర్మించడంతోపాటు తాగునీటి సమస్యను కూడా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో ఎన్.శ్రీనివాసరెడ్డి, ఎస్.రమణ గౌడ్, సివి.వర్మ, ఎ.విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

దౌర్జన్యాన్ని ఆపేదెవరు?

దళితుల ఇండ్ల కూల్చివేత-పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-కర్నూలు క్రైం



కూల్చిన పేద దళితుల ఇల్లు

కర్నూలు నగరంలో దౌర్జన్యంగా కొంతమంది పలుకుబడి కలిగిన వ్యక్తులు దళితుల ఇండ్లను దౌర్జన్యంగా కూల్చివేశారు. నగర కేంద్రంలో చోటు చేసుకున్న ఈ ఘటన ప్రస్తుతం నగర వాసుల్లో ఆందోళన కలిగిస్తోంది. వివరాల్లోకి వెళితే కర్నూలు నగరం, అంబేద్కర్ నగర్‌లో దళిత కుటుంబాలకు చెందిన మాల లలిత(ప్లాట్ నెంబర్:103), దుర్గమ్మ లేట్(ప్లాట్ నెంబర్:104), స్వర్ణలత (ప్లాట్ నెంబర్: 105) ప్రభుత్వ స్థలంలో గత 14 ఏళ్లుగా రేకుల షెడ్డును నిర్మించుకొని నివాసం ఉంటున్నారు. 2008లో వారికి అప్పటి రెవెన్యూ అధికారులు నివేశ పత్రాలను అందజేశారు. ఇండ్లపై కరెంటు మీటర్లు కూడా వారి పేరుతో మంజూరు అయ్యాయి. కొద్దిరోజుల కిందట దుర్గమ్మ చనిపోవడంతో ఆమె ఇంటిలో కుమారుడు, మల్లేష్, కోడలు మద్దమ్మ నివాసం ఉంటున్నారు. సదరు కుటుంబ సభ్యులు వివిధ పనులు చేసుకుని జీవనం సాగిస్తూ వస్తున్నారు. నెల రోజుల కిందట అధికార పార్టీ పేరు చెప్పుకొని ఓ మహిళ ఎమ్మెల్యే అనుచరులమని, ఈ స్థలం తమదని, వెంటనే ఖాళీ చేయాలని లేదంటే అంతుచూస్తామని బెదిరింపులకు దిగారు. ఇవి తమవని నోరు నెత్తి మొత్తుకున్నా వారు తమ దౌర్జన్యాన్ని ఏమాత్రం ఆపలేదు. పైగా అందరూ చూస్తుండగానే ఇంటి తలుపులను ధ్వంసం చేశారు. రెండు మూడు రోజుల్లో ఖాళీ చేయకపోతే నేలమట్టం చేస్తామని బెదిరించి అప్పట్లో వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో తిరిగి బుధవారం తెల్లవారుజామున ఇంట్లో ఎవరు లేని సమయాన్ని చూసి సదరు వ్యక్తులు రాత్రికి రాత్రే రేకుల షెడ్లను నేలమట్టం చేసి వెళ్లారు. బంధువుల శుభకార్యం కోసం వెళ్లి వచ్చి చూసిన ఇంటి యజమానులకు నేలమట్టమై ఉన్న ఇంటి రేకులు, బండలు, వస్తువులు, వంట సామాను దర్శనం ఇవ్వడంతో బోరున విలపించారు. దౌర్జన్యాన్ని ఆపేవారు లేరా అంటూ ఆవేదనను వెలిబుచ్చారు. బాధితులు ఇదివరకే సదరు వ్యక్తుల దౌర్జన్యంపై సంబంధిత పోలీస్ స్టేషన్ సహా, జిల్లా ఎస్‌పికి ఫిర్యాదు చేసినా కనీస ఫలితం లేదని వాపోయారు. ఇప్పటికైనా దౌర్జన్యకారుల ఆగడాల నుంచి తమకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని బాధితులు వేడుకుంటున్నారు.



ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్‌కు స్వాగతం పలుకుతున్న ఉల్చాల ప్రజలు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే సుధాకర్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. బుధవారం కర్నూలు మండలం, ఉల్చాల గ్రామంలో 1వ సచివాలయంలో కర్నూలు ఎంపిపి వాసు వెంకటేశ్వరమ్మ, సర్పంచి విద్యాసాగర్‌తో కలసి ఎమ్మెల్యే గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో ఆయన ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్ లెట్స్‌ను అందజేశారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ, వాలంటీర్ల వ్యవస్థతో ఇళ్ల వద్దకే పథకాలు వచ్చేలా జగనన్న పాలన సాగుతోందన్నారు. జనరంజక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగనన్నను మరొక్కమారు ఆశీర్వదించాలని కోరారు. జడ్‌పిటిసి ప్రసన్నకుమార్, వార్డ్ మెంబర్లు సత్యరెడ్డి, శ్రీధర్, చైర్మన్ అమర్నాథ్‌రెడ్డి, మాజీ ఉపాధ్యక్షుడు వాసు, సుధాకర్, షేక్ కలాం, పశువుల సుధాకర్, గంజిల్లా మాదన్న, ప్రతాప్, పశువుల రాముడు, మండల అధికారులు సచివాలయం సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

టిజివి భరత్ షటిల్ కోర్టు ప్రారంభం

కర్నూలు అభివృద్ధికి ఎప్పుడూ ముందుంటాం టిజి.వెంకటేష్, టిజి భరత్

ప్రజాశక్తి-కర్నూల్ స్పోర్ట్స్

కర్నూలు నగరం అభివృద్ధికి తమ టిజివి సంస్థల నుండి ఎలాంటి సహకారం కావాలన్నా ఎప్పుడూ ముందుండి అందిస్తామని మాజీ ఎంపి టిజి. వెంకటేష్, టిడిపి కర్నూలు ఇంచార్జి టిజి భరత్ అన్నారు. నగరంలోని బి.క్యాంపులోని ఆఫీసర్స్ క్లబ్‌లో టిజివి సంస్థల నుండి రూ. 18 లక్షల నిధులతో నూతనంగా పునరుద్ధరించిన టిజివి భరత్ ఇండోర్ షటిల్ కోర్టును బుధవారం టిజి. వెంకటేష్, టిజి. భరత్ ప్రారంభించారు. టిజి. వెంకటేష్ మాట్లాడుతూ కర్నూలులో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయాలన్నా తాము ముందు వరుసలో ఉండి సహకారం అందిస్తామని చెప్పారు. ఆఫీసర్స్ క్లబ్‌ను అందరూ వినియోగించుకొని వృద్ధిలోకి తీసుకురావాలని సూచించారు. క్లబ్ సభ్యులను కూడా పెంచాలని చెప్పారు. టిజి. భరత్ మాట్లాడుతూ మనిషి జీవితంలో వ్యాయామం, క్రీడలు చాలా అవసరమన్నారు. అందుకే తామెప్పుడూ కర్నూల్లో క్రీడల అభివృద్ధికి, క్రీడాకారులకు సహకారం అందిస్తూనే ఉంటామన్నారు. ఇక ఆఫీసర్స్ క్లబ్ లో సభ్యులు తగ్గిపోయినట్లు తెలిసిందని.. అందరూ ఈ సింథటిక్ కోర్టును సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నట్లు భరత్ తెలిపారు. అందుకే రాజకీయాల్లోకి వచ్చినట్లు చెప్పారు. ప్రభుత్వంలో ఉంటే అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలన్నీ చేయడానికి ఆస్కారం ఉంటుందన్నారు. అందరూ ఆలోచించి తమ ప్రాంతం అభివృద్ధి చేసే నేతను ఎన్నుకోవాలని తాను కోరుతున్నట్లు చెప్పారు. మా దృష్టంతా కర్నూలు అభివృద్ధి, ఇక్కడి ప్రజలు బాగుండాలన్న దానిపైనే ఉంటుందన్నారు. సెక్రటరీ డాక్టర్ రామేశ్వరరెడ్డి, ఇంచార్జి డాక్టర్ మాణిక్యరావు, డాక్టర్లు వెంకట రంగారెడ్డి, ఉమా మహేశ్వర రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఇండోర్ షటిల్ కోర్టు ప్రారంభ కార్యక్రమంలో టిజి.వెంకటేష్, టిజి.భరత్ తదితరులు

వర్సిటీ రిజిస్ట్రార్ రెక్టార్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- కర్నూలు



కలెక్టరేట్: రాయలసీమ యూనివర్సిటీ రెక్టార్‌గా సివి.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్‌గా . సుందరంపుచ్చ, కళాశాల అభివద్ధి మండలి డీన్‌గా ఎస్తేరు రాణి. బుధ వారం పదవీ బాధ్యతలు తీసుకు న్నారు. రాయలసీమ యూనివర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్, డైరెక్టంగ్‌గా ఆచార్య నర్సింహులు పదవీ బాధ్యాతలు తీసుకున్నారు. కృష్ణారెడ్డి ఫిజిక్స్ హెడ్‌గా, ప్రిన్సిపాల్‌గా, ఇసి మెంబర్‌గా ఉన్నారు. సుందరానంద్‌పుచ్చ ఇప్పటికే రిజిస్ట్రార్‌గా, మ్యాథమెటిక్స్ హెడ్‌గా, డీన్‌గా పనిచేశారు. ఎస్తేరు రాణి రసాయన శాస్త్ర హెడ్‌గా, ఛైర్మన్, బోర్డ్ ఆఫ్ స్టడీస్ గా డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్, డైరెక్టర్ , మహిళా రక్షణ సెల్ ఛైర్మన్‌గా పనిచేశారు. వర్సిటీలో వీసీ ఆనందరావు ఆదేశాల మేరకు బాధ్యతలు నిర్వహి స్తామన్నారు. రాయలసీమ యూనివర్సిటీ అభివృద్ధి కోసం కలిసి పనిచేస్తామని తెలిపారు. నూతన అధికారులకు వర్సిటీ అధ్యాపకులు, మధుసూదన వర్మకు అసిస్టెంట్ ప్రొఫెసర్ కాంట్రాక్ట్ , నాన్ టీచింగ్ రెగ్యులర్ టైమ్ స్కేల్ సిబ్బంది, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

ఎస్‌సి, ఎస్‌టి గెజిటెడ్ క్యాలెండరు, డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి- సి బెళగల్



మండలంలోని ఎస్‌సి, ఎస్‌టి గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ 2023 క్యా లెండరు, డైరీలను ఎంపిడిఒ రాముడు, తహసీల్దార్ శివశంకర్ నాయక్, ఎంఇఒ జ్యోతి, ఇఒఆర్‌డి రాముడు, డాక్టర్ ప్రవీణ్ తదితరులు బుధవారం ఆవిష్కరణ చేశారు. ఇక్కడే సంఘాలలోని సచివాలయంను తనిఖీ చేసి విధుల పట్ల బాధ్యతగా పనిచేయాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందాలి : ఎఒ

ప్రజాశక్తి- సి బెళగల్ : ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందాలని పంచాయతీ ప్రత్యేక అధికారి ఎఒ మల్లేష్ కుమార్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండలంలోని గుండ్రేవుల సచివాలయంను తనిఖీ చేసి సిబ్బంది హాజరును పరిశీలించారు. ఇక్కడే పథకాల అమలులో ప్రభుత్వం లక్ష్యంగా ఉందని అందులో మనమంతా కార్యాచరణ చేపట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు మాధవి, కార్యదర్శి మేరీ థెరిస్సా గ్రామ పెద్దలు శ్రీనివాస రెడ్డి వాలంటీర్లు పాల్గొన్నారు.

లంచం తీసుకుంటూ...

ఎసిబికి చిక్కిన ఉద్యోగి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్



పట్టుబడిన ఉద్యోగితో ఉన్న ఎసిబి అధికారులు

మండలంలోని చిన్నపెండేకల్ గ్రామ కార్యదర్శి మల్లయ్య లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు బుధవారం పట్టుబడ్డారు. గ్రామానికి చెందిన గురురాజారెడ్డి అనే వ్యక్తి తనకు వారసత్వంగా లభించిన నివాస స్థలానికి యాజమాన్య ధ్రువీకరణ పత్రానికి దరఖాస్తు చేశారు. ఈ క్రమంలో కార్యదర్శి మల్లయ్య ధ్రువీకరణ పత్రం జారీకి రూ.7 వేల లంచం డిమాండ్ చేశారు. చివరికి రూ.4 వేలకు ఒప్పందం కుదిరింది. ఫిర్యాదుదారుని సమాచారంతో లంచం ఇస్తుండగా పట్టుకున్నట్లు ఎసిబి డీఎస్పీ శివనారాయణ స్వామి తెలిపారు. నగదును సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు లింగన్న

ప్రజాశక్తి-కోసిగి రూరల్



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న లింగన్న

మండలంలో పెండింగ్‌లో ఉన్న ఉపాధి వేతనాలు తక్షణమే చెల్లించి ఉపాధి కూలీలను ఆదుకోవాలని, అలాగైతేనే వలసలు నివారణకు అవకాశం ఉంటుందని వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, సిఐటియు మండల కార్యదర్శి రాముడు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని ఆర్లబండ గ్రామంలో ఉపాధి పనుల దగ్గరకు వెళ్లి పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. చట్ట ప్రకారం పని చేసిన 15 రోజుల్లోపు వేతనాలు చెల్లించాలని తెలిపారు. నెలలు గడుస్తున్నా వేతనాలు అందడం లేదన్నారు. వంద రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాలకు పని లేక వలసలు వెళ్తున్నారని తెలిపారు. ఉపాధి పని దినాలు 200 రోజులకు పెంచాలని, పెరుగుతున్న ధరలను దృష్టిలో ఉంచుకొని ఉపాధి వేతనం రూ.600 ఇవ్వాలని కోరారు. ఉపాధి హామీ చట్టానికి ఈ బడ్జెట్‌లో రూ.1.20 లక్ష కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు రాయితీలు ఇస్తూ, ఎండలో కష్టపడి పని చేస్తున్న ఉపాధి కూలీలకు మాత్రం వేతనాలు సక్రమంగా అందించడం లేదని విమర్శించారు. ఈ ఉపాధి హామీని నిర్వీర్యం చేయడానికి కుట్ర చేస్తోందని, దీనికి వ్యతిరేకంగా వ్యకాస, కూలీలను ఐక్యం చేసి ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉపాధి కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



క్రీడాకారులను అభినందిస్తున్న ఉల్లిగయ్య

క్రీడాకారులను అభినందించిన ఉల్లిగయ్య

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీసిద్ధేశ్వర స్వామి రథోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన గోతులదొడ్డి జట్టును టిడిపి మంత్రాలయం సీనియర్ నాయకులు ఉల్లిగయ్య అభినందించారు. బుధవారం ఆయన మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. స్నేహభావం, మంచి నైపుణ్యంతో తమ సామర్థ్యాన్ని ప్రదర్శించాలన్నారు. ఆటల పోటీల్లో గెలుపొందడంతో తల్లిదండ్రులతో పాటు గ్రామానికి మంచి పేరు వచ్చిందని తెలిపారు. క్రీడాకారులకు ప్రోత్సాహం అందించడంలో ఎల్లప్పుడూ ముందుంటామని పేర్కొన్నారు.

హుండీ ఆదాయం రూ.39 లక్షలు

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి హుండీ లెక్కింపు రెండో రోజు బుధవారం కూడా కొనసాగిందని ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ నాగరాజు గౌడ్, దేవాలయ సహాయ కమిషనర్ వాణి తెలిపారు. ఈ లెక్కింపు ఆదోని ఎండోమెంట్ అధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించామన్నారు. హుండీ ఆదాయం రూ.39,58,672 వచ్చినట్లు తెలిపారు. బంగారం 1 గ్రాము 500 మిల్లీ గ్రాములు, వెండి 4 కిలోల 900 గ్రాములు వచ్చినట్లు చెప్పారు. దేవాలయ సిబ్బంది, ప్రధాన అర్చకులు ఎక్స్ అఫీషియో సభ్యులు ఈరప్ప, పాలకమండలి సభ్యులు వెంకోబా, విజయేంద్ర రెడ్డి, నరసింహులు, లక్ష్మి కాంత్ రెడ్డి, గీతారెడ్డి, నరసమ్మ పాల్గొన్నారు.

సంకల్ప దీక్షను జయప్రదం చేయాలి

- యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లప్ప

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ కోసం గన్నవరం దగ్గర ధర్మస్థలిలో జరిగే సంకల్ప దీక్షను జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జె.ఎల్లప్ప డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ప్రాంతీయ కార్యాలయంలో సంకల్ప దీక్ష గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉద్యోగుల, ఉపాధ్యాయుల భద్రతకు మచ్చగా పరిణమిస్తున్న సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.దావీదు మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న జిపిఎస్ వల్ల సిపిఎస్‌లో కంటే కొద్ది పాటి ప్రయోజనాలు అదనంగా చేసినా అది ఉద్యోగుల విరమణ అనంతరం భద్రత కల్పించేదిగా లేదని తెలిపారు. రాష్ట్ర కౌన్సిలర్ మల్లారి నాగరాజు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు డి.కౌలన్న మాట్లాడారు. ఈనెల 3న ధర్మస్థలిలో చేపట్టే సంకల్ప దీక్షలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వై.రామాంజనేయులు, చంద్రపాల్, ప్రసాద్, ఎం.రాజు, కె.భాగ్యరాజు, సుధాకర్, బాబు, శంకర్ నాయక్, నాగేశ్వరరావు, పాపయ్య పాల్గొన్నారు.

3న సిపిఎస్ రద్దు కోసం సంకల్ప దీక్ష

ఆదోనిరూరల్ : పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలని ఈనెల 3న గన్నవరం సమీపంలోని ధర్మస్థలిలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో సంకల్ప దీక్ష చేపడుతున్నట్లు యుటిఎఫ్ మండల అధ్యక్షులు సుధాకర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు నారాయణ, నాయకులు రంగనాయకులు, రామాంజనేయులు తెలిపారు. బుధవారం దీక్షకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రిటైర్డ్ ఉద్యోగుల జీవితాలకు భద్రత కల్పించే విధానాలేవీ జిపిఎస్‌లో లేవన్నారు. రాష్ట్రంలో 3 లక్షల మంది ఉద్యోగులు సిపిఎస్‌లో ఉన్నారని, వారికంతా ఒపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే చాలా రాష్ట్రాలు ఉద్యోగుల డిమాండ్ మేరకు సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేస్తున్నాయని తెలిపారు. గన్నవరం సమీపంలోని ధర్మస్థలిలో చేపట్టే సంకల్ప దీక్షకు రాష్ట్రంలోని అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు కూడా హాజరై ఉద్యోగుల ఒపిఎస్ పోరాటానికి సంఘీభావం తెలపాలని కోరారు. అలాగే సిపిఎస్ రద్దుపై రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు వైఖరిని ప్రకటించాలని తెలిపారు. యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరు : సమావేశంలో మాట్లాడుతున్న ఎల్లప్ప



ఆదోనిలో గోడపత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు



లంక దహనంలో పాల్గొన్న నాయకులు

ఆకట్టుకున్న లంక దహనం

ప్రజాశక్తి- హోళగుంద

హోళగుందలో రెండు రోజులుగా జరుగుతున్న సిద్ధేశ్వర జాతరలో భాగంగా మంగళవారం రథోత్సవం జరగగా, రెండో రోజు బుధవారం జరిగిన లంక దహనం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. ముఖ్య అతిథులుగా సిరుగుప్ప ఎమ్మెల్యే సోమలింగప్ప, వైసిపి ఆలూరు తాలూకా ఇన్‌ఛార్జీ నారాయణ స్వామి, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి కుమారుడు ఈశ్వర్ హాజరయ్యారు. రంగురంగుల బాణాలు, కనువిందు చేసే వివిధ రకాల బాణాసంచాలు శ్రీసిద్ధేశ్వర ఆవరణంలో గంటసేపు పేల్చారు. వచ్చిన భక్తులు తిలకించి ఆనందంలో మునిగితేలారు. ప్రతేడాది ఆలయ ధర్మకర్త రాజా పంపను గౌడ ఆధ్వర్యంలో వేడుకలు జరగడం విశేషం. లంక దహనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా సిఐ ఈశ్వరయ్య, ఎస్ఐ అబ్దుల్ జహీర్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు కోరారు. బుధవారం డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. డిప్యూటీ తహశీల్దార్ గాయత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మైనా, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పోతురాజు మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతోమంది అమరులు ప్రాణ త్యాగాలు చేశారని తెలిపారు. అలాంటి స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలను గోడకు ఉండగా తీసేయించి మూలన పెట్టి కళాశాల ప్రిన్సిపల్ అవమానపరిచారన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జెండాను కూడా ఆవిష్కరించకూడదని అనడం, ఆ రోజే విధులకు హాజరు కాకుండా నిర్లక్ష్యం వహించారని చెప్పారు. విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న ప్రిన్సిపల్‌పై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రాఘవేంద్రస్వామి నిజ బృందావన దర్శనం

మంత్రాలయం : ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో భక్తులకు రాఘవేంద్రుని నిజ బృందావన దర్శన భాగ్యం కల్పించారు. బుధవారం భీష్మ ఏకాదశీ సందర్భంగా పూజారులు రాఘవేంద్రుని మూల బృందావనాన్ని నిర్మాల్యం చేసి తులసి అర్చన, పూజలు నిర్వహించారు. అనంతరం బృందావనాన్ని తులసి మాలతో అలంకరించారు. ఏకాదశీ సందర్భంగా స్వామి వారికి నైవేద్య సమర్పణ లేకపోవడంతో భక్తులకు అన్నదానం పరిమళ ప్రసాదం విక్రయం లేకపోవడం ఆనవాయితీ. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు రాఘవేంద్రుని ఆరాధ్య దైవమైన మూల రాములకు విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం రాఘవేంద్రుని బృందావనాన్ని దర్శించుకుని మంగళ హారతులు ఇచ్చారు.

ప్రజా సంక్షేమం కోసమే 'గడపగడపకు'

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ప్రజా సంక్షేమం కోసమే 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని నాగనాథనహళ్లి గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయి మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన 'గడపగడపకు మన ప్రభుత్వం' ప్రజాదరణ పొందుతోందని తెలిపారు. పేదలందరికీ నవరత్నాలు అందుతున్నాయా, సమస్యలు ఏమిటి ఇక్కడ తాగునీరు, వీధి దీపాలు, డ్రెయినేజీ, రోడ్లు వంటి సమస్యలపై ఆరా తీశారు. గ్రామంలో సచివాలయ నిధుల రూ.20 లక్షలతో పనులు పూర్తి చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. గ్రామంలో రైతులందరికీ బీమా పరిహారం రూ.3 కోట్లు వచ్చినందుకు రైతులు సంతోషం వ్యక్తం చేశారు. అంతకుముందు ప్రజలు ఆయనకు పూలమాలతో స్వాగతం పలికారు. సర్పంచి వరదప్ప, ఆర్‌డబ్ల్యుసి ఎఇ నాగ మల్లయ్య, ఇఒఆర్‌డి జనార్ధన్, ఎపిఒ చంద్రశేఖర్, ఎపిఎం జనార్ధన్, హౌసింగ్ బోర్డు అధికారి తిప్పన్న, వైసిపి సీనియర్ నాయకులు తిమ్మారెడ్డి, వల్లభ రెడ్డి, ఎంపిటిసి నరేంద్ర రెడ్డి, శంకర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, ఉల్తప్ప, రామలింగేశ్వర యాదవ్, తిమ్మప్ప, తాయన్న, చిన్న ఈరన్న పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

పట్టుబడిన వాహనాలకు 3న వేలం : సిఐ

ప్రజాశక్తి - ఆదోని



పట్టణంలోని సెబ్ స్టేషన్ పరిధిలో సీజ్ చేసిన వాహనాలకు ఈనెల 3న వేలం నిర్వహిస్తామని ఆదోని సెబ్ సిఐ హరికృష్ణ బుధవారం తెలిపారు. నంద్యాల ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీధర్ రావు ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహిస్తారని తెలిపారు. ఇందులో కార్లు, ఆటోలు, మోటార్ సైకిళ్లు ఉంటాయని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు స్టేషన్‌కు వచ్చి రూ.5 వేలు ధరావతు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

తిక్కా రెడ్డి మనువని నామకరణోత్సవం

- హాజరైన టిడిపి ప్రముఖులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

టిడిపి మంత్రాలయ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి మనువడు గౌతమి విఖ్యాత్ నామకరణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. బుధవారం పట్టణంలోని శ్రీవాసవీ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమానికి పలువురు నాయకులు హాజరయ్యారు. కేంద్ర మాజీ మంత్రి, టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ, ఆదోని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, ఎమ్మెల్సీ బిటి.నాయుడు, టిడిపి పత్తికొండ ఇన్‌ఛార్జీ కెఇ.శ్యాంబాబు, జిల్లా అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, జడ్‌పి మాజీ ఛైర్మన్ రాజశేఖర్, మంత్రాలయం మండల ఇన్‌ఛార్జీ పన్నగ వెంకటేష్, జిల్లా నాయకులు రమాకాంత్ రెడ్డి, వైసిపి నాయకులు సోగనూరు భీమ్ రెడ్డి, ఉరుకుంద దేవాలయం మాజీ ఛైర్మన్ శివ మోహన్ రెడ్డి, నాయకులు చిన్న బసప్ప, స్వామి ఓం నగర్ తాతలు హాజరయ్యారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

- సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అంగన్వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు మండల కన్వీనర్ బి.రాముడు, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి బి.గోవర్ధనమ్మ, పట్టణ కార్యదర్శి ఎస్.నాగలక్ష్మి డిమాండ్ చేశారు. బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో 6న చేపట్టే చలో కలెక్టరేట్‌కు సంబంధించిన సమస్యల పత్రాన్ని సిడిపిఒకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 2019లో జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర సమయంలో అంగన్వాడీ కార్యకర్తలను రెగ్యులర్ చేస్తామని, కనీస వేతనాన్ని అమలు చేస్తామని, గ్రాట్యుటీ, పింఛను ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. నాలుగేళ్లవుతున్నా అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లను సచివాలయ సిబ్బందితో వేధింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. సంక్షేమ పథకాల్లో కోత విధించడం శోచనీయమన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీసం రూ.26 వేలు అందజేయాలని, పింఛను సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. 6న చేపట్టే చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని కోరారు. జీనత్ భాను పాల్గొన్నారు.



సిడిపిఒకు పత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

అంగన్వాడీకి 3 సెంట్లు స్థలం అందజేసిన సర్పంచి

ప్రజాశక్తి-హాలహర్వి

హాలహర్విలోని 3వ అంగన్వాడీ కేంద్రానికి ఉచితంగా 3 సెంట్ల స్థలాన్ని సర్పంచి మల్లికార్జున బహూకరించారు. బుధవారం హాలహర్విలోని సర్వే నెంబరు 399/ఈ1లో గల భూమిలో 3 సెంట్లు కేటాయించారు. ఈ సందర్భంగా సర్పంచి మల్లికార్జున మాట్లాడారు. కొన్నేళ్లుగా అంగన్వాడీ కేంద్రం అద్దె భవనంలో కొనసాగుతోందని తెలిపారు. వసతులు లేక పిల్లలు, బాలింతలు, గర్భిణులు, అంగన్వాడీ వర్కర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఇబ్బందులను గుర్తించి ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ లలిత, సూపర్‌వైజర్, అంగన్వాడీ సిబ్బందికి స్థలాన్ని కేటాయించినట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు, సంబంధిత అధికారులు త్వరగా అంగన్వాడీ కేంద్రాన్ని నిర్మించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంచాయతీ సెక్రటరీ ఈరన్న, అంగన్వాడీ వర్కర్ శ్రీదేవి, సచివాలయ ఇంజినీర్ రంగస్వామి పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలను ఢీకొన్న లారీ

- అంధకారంలో గుండాల కట్ట వీధి

- యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టిన విద్యుత్ అధికారులు

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరి నుంచి ఆలూరుకు వెళ్లే దారిలో గుండాల కట్ట వీధి దగ్గర మంగళవారం రాత్రి గుర్తు తెలియని లారీ విద్యుత్ స్తంభాలను ఢీకొట్టింది. దీంతో ఆ ప్రాంతమంతా అంధకారంలోకి వెళ్లింది. ఆలూరు నుంచి కర్నూలుకు వెళ్లే లారీ విద్యుత్ స్తంభాలను ఢీకొట్టింది. స్తంభాలకు ఉన్న తీగలు తెగిపోవడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. స్పందించిన విద్యుత్ ఎఇ మల్లికార్జున సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. బుధవారం ఉదయం యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంలో జెఎల్ ఎం.శేషప్ప, లైన్ ఇన్‌స్పెక్టర్ జయన్న, లైన్ మ్యాన్ వీరశేఖర్, విద్యుత్ సిబ్బంది అర్జున్ పాల్గొన్నారు.



విద్యుత్ స్తంభాలను నాటుతున్న విద్యుత్ సిబ్బంది

వైభవంగా మాచిదేవ జయంతి

ప్రజాశక్తి - ఆదోని

పట్టణ రజక సంఘం ఆధ్వర్యంలో మడివేల మాచిదేవ జయంతిని బుధవారం ఉత్సాహభరితంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, వైసిపి యువ నేత జయమనోజ్ రెడ్డి, ఎపి రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గురుశేఖర్, రజక ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు గోవిందప్ప, నరసింహులు, నరసింహ రాజు, రజక సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బెరీ ఈరన్న, ముక్కన్న, నాయకులు రామన్న వేర్వేరుగా పూజలు నిర్వహించారు. మడివేల సేవలను, ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని వారు కోరారు. రజక వృత్తిదారుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఉరుకుందు, నాయకులు వెంకటేష్, ఉరుకుందు, మహేష్, నాగేష్, రంజిత్, మల్లప్ప, నాగప్ప, వీరేష్ పాల్గొన్నారు. **హోళగుంద** గ్రామ రజక సంఘం ఆధ్వర్యంలో మడివేల మాచిదేవ జయంతి నిర్వహించారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. మంగయ్య, లక్ష్మణ, ఎల్ఐసి నాగరాజు, బసవరాజు, మల్లికార్జున, కరెంటు మల్లికార్జున, రవి, రాజా, శేఖర్, లక్ష్మణ, మల్లి పాల్గొన్నారు. **మంత్రాలయం**లో రజకుల కుల దైవం మడివాల మాచిదేవ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక పాతవూరులో వెలసిన శ్రీఆంజనేయ స్వామి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన మాచిదేవ చిత్రపటానికి వైసిపి యువనేత వై.ప్రదీప్ రెడ్డి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం అక్కడ నుంచి ఆర్‌టిసి బస్టాండ్ మీదుగా మడివెళ్లప్ప ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, వైసిపి పట్టణ ప్రధాన కార్యదర్శి అశోక్ రెడ్డి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర, ఉప సర్పంచి హోటల్ పరమేష్, ఎంపిటిసి సభ్యులు వెంకటేష్ శెట్టి పాల్గొన్నారు. **కౌతాళం**లో మడివాల మాచిదేవ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని రజక సంఘం ఆధ్వర్యంలో మాచిదేవ చిత్రపటాన్ని ఊరేగించారు. గిరప్ప, స్టాంపు ఫక్కీరయ్య, ఉచ్చప్ప, లింగన్న, నరేష్ పాల్గొన్నారు.



హోళగుందలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు



కౌతాళంలో...



ఆదోనిలో పూజలు చేస్తున్న రజక సంఘం నాయకులు



మంత్రాలయంలో పూజలు నిర్వహిస్తున్న ప్రదీప్‌రెడ్డి, నాయకులు

ప్రభుత్వాస్పత్రిలో సిటి స్కాన్ ఏర్పాటు చేయాలి : జనసేన

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగుల సౌకర్యార్థం సిటి స్కాన్ ఏర్పాటు చేయాలని జనసేన నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జనసేన నాయకులు ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని పరిశీలించారు. ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను జనసేన బృందం దృష్టికి తెచ్చారు. బాత్‌రూంలో కుళాయి పని చేయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని రోగులు, వారి సహాయకులు తెలిపారు. ఆస్పత్రిలో తాగునీరు కూడా అందుబాటులో ఉండడం లేదని వాపోయారు. వైద్యులు కొన్ని మందులను బయట తెచ్చుకోవాలని చీటీ ఇస్తున్నారని తెలిపారు. ఆస్తమా, తలనొప్పితో వచ్చిన ప్రతి రోగికీ సిటి స్కానింగ్ పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారని చెప్పారు. రూ.2500 నుంచి రూ.5 వేల ఖర్చు అవుతోందన్నారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు ఎం.తాహేర్ వలీ, పులి రాజు, రాజేశ్వరి, రాజశేఖర్ మాట్లాడారు. ఆస్పత్రికి వస్తున్న పేద రోగులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సిటి స్కానింగ్ పరికరాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రక్త పరీక్ష ఎక్స్ రే, ఈసీజీ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉండాలని కోరారు. అత్యవసరమైతే రాత్రి సమయంలో కూడా అందుబాటులో ఉండాలని తెలిపారు. అలా లేకపోవడంతో వైద్యం కోసం వచ్చిన రోగులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం ఆకస్మిక తనిఖీలతోపాటు ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. మల్లి, హుస్సేన్, రాజశేఖర్, అయ్యప్ప, అజయ్, శ్యామ్, వెంకటేష్, మంతేశ్, భీమన్న, వీరేష్, ప్రకాష్, జయరాం ఉన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న జనసేన నాయకులు

పెద్దమర్రివీడులో ఆలయాల శిఖర కలశ ప్రతిష్టాపన

- హాజరైన మాజీ ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని పెద్దమర్రివీడు గ్రామంలో వివిధ ఆలయాలకు కలశ ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని శివాలయం, ఆంజనేయ స్వామి, బీరప్ప స్వామి దేవాలయాల్లో బుధవారం భీష్మ ఏకాదశీ సందర్భంగా శిఖర కలశ ప్రతిష్టాపన చేపట్టారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయా దేవాలయాలను సందర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. టిడిపి నాయకులు బేతాళ బడేసాబ్, నజీర్ సాహెబ్, అబ్దుల్లా, తిరుపతయ్య నాయుడు, నాగరాజు, రంగస్వామి నాయుడు, సందీప్ నాయుడు, జయపాల్, మునిస్వామి, మల్లేష్, రాముడు, చంద్రన్న గౌడ్, ఈరన్న గౌడ్, లక్ష్మన్న, ముస్తఫా, వడ్డే చంద్ర పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీవీ, టిడిపి నాయకులు

కేంద్ర బడ్జెట్‌పై నిరసనలు

ప్రజాశక్తి- యంత్రాంగం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ సిపిఎం, సిఐటియు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో బుధవారం ఆందోళన కార్యక్రమాలు జరిగాయి. కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రైల్వే జోన్, పోలవరం ప్రాజెక్టు మాట బడ్జెట్‌లో లేదని వక్తలు తెలిపారు. పెట్టుబడిదారులకు ప్రయోజనం చేకూర్చే ఈ బడ్జెట్‌ను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. సిపిఎం అనంతపురం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అనంతపురం కలెక్టరేట్ వద్ద బడ్జెట్ ప్రతులను చింపి నిరసన తెలిపారు. సిఐటియు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ దేశ సంపద, సహజ వనరులు, ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు దోచి పెట్టేందుకు మోడీ ప్రభుత్వం నిస్సిగ్గుగా బడ్జెట్‌లో ప్రతిపాదనలు చేసిందని విమర్శించారు. తీవ్ర సంక్షోభంలో ఉన్న వ్యవసాయాన్ని విస్మరించి కార్పొరేట్ వ్యవసాయాన్ని పెంచేందుకు ఎరువుల సబ్సిడీపై 25 శాతం కోత విధించారన్నారు. వెనుకబడిన రాయలసీమ అభివృద్ధికి ఎలాంటి చర్యలూ ప్రకటించకపోవడం దుర్మార్గమని తెలిపారు. అనంతపురం జిల్లాలో ఎనిమిది సంవత్సరాల క్రితం ప్రకటించిన కేంద్రీయ విశ్వవిద్యాలయం ఇప్పటికీ ప్రహరీ దాటలేదన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని గడియార స్తంభం సెంటర్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.హరిబాబు మాట్లాడుతూ కేంద్రం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరాన్ని నిర్లక్ష్యం చేసిందని తెలిపారు. ఉపాధి హామీకి గత సంవత్సరం కంటే రూ.25 వేల కోట్లు తక్కువ కేటాయించడం అన్యాయమన్నారు. దేశంలో 16 శాతం ఉన్న షెడ్యూల్డ్ కులాలకు 3.5 శాతం మాత్రమే బడ్జెట్‌లో కేటాయించారని, 8.6 శాతంగా ఉన్న షెడ్యూల్ జాతులకు 2.7 శాతం మాత్రమే కేటాయించారని, సబ్‌ప్లాన్ గురించి ప్రస్తావనే లేదని తెలిపారు. ఈ ధర్నాల్లో సిపిఎం, సిఐటియు, కెవిపిఎస్, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులు నాయకులు పాల్గొన్నారు. కేంద్ర బడ్జెట్‌లో కడప ఉక్కును విస్మరించడాన్ని నిరసిస్తూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కడప పాత బస్టాండ్‌లోని జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. విజయనగరం జిల్లా రాజాంలో సిటియు ఆధ్వర్యాన నిరసన తెలిపారు. కేంద్ర బడ్జెట్ కార్మికులకు, రైతులకు, శ్రమ జీవులకు, ప్రజలకు పూర్తిగా వ్యతిరేకంగా ఉందని వక్తలు విమర్శించారు.



డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని గడియార స్తంభం సెంటర్‌లో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, ఎపి కౌలు రైతు సంఘం ఆధ్వర్యాన నిరసన

బడ్జెట్ బాగుంది

- ఆర్థికశాఖ మంత్రి బుగ్గన

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి


కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోని అంశాలు రాష్ట్రానికి ఉపయోగపడేలా ఉన్నాయని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కేంద్ర బడ్జెట్‌పై బుధవారం ఆయన స్పందిస్తూ.. కొన్ని రంగాల్లో నిధులు తగ్గినట్లు చెప్పారు. ద్రవ్యలోటును తగ్గించడం మంచిదని, పెట్టుబడి వ్యయం రూ.2.5 లక్షల కోట్లు పెరిగిందని పేర్కొన్నారు. పన్నుల ఆదాయం, రూ.3 లక్షల కోట్లకుపైగా పెరిగిందని, అందులో రాష్ట్రాల వాటా కూడా గణనీయంగా పెరిగిందన్నారు. అయితే ఎరువులు, పౌర సరఫరాల్లో ఆహార సరుకుల విషయంలో నిధులను తగ్గించారని పేర్కొన్నారు. పెట్రో ఆదాయం కూడా ఏడు వేల కోట్ల వరకు తగ్గినట్లు చెప్పారు.

రొయ్యల ఉత్పత్తిలో మేతపై ఇంపోర్ట్ డ్యూటీని తగ్గించాలని కూడా నిర్ణయించడం సంతోషకరమన్నారు. ఆర్ఐడిఎఫ్ మాదిరిగానే పట్టణ ప్రాంతాల్లో పథకాల కోసం బిఐడిఎఫ్ తీసుకురానున్నారని, నర్సింగ్ కాలేజీల వల్ల, స్కిల్ హబ్‌ల ద్వారా రాష్ట్రానికి మేలు కలుగుతుందన్నారు.

రాష్ట్రానికి నిరాశే

- 31 మంది ఎంపిలు ఉండి వైసిపి ఏమీ సాధించలేదు
- టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి, రాష్ట్ర ప్రాజెక్టులకు ఆశించిన కేటాయింపులు లేకపోవడం నిరుత్సాహాన్ని కలిగించిందని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. కర్ణాటకలోని కరువు ప్రాంతాల కోసం కేంద్ర బడ్జెట్‌లో రూ.5,300 కోట్లు కేటాయించారని, విభజన చట్టం ప్రకారం రాష్ట్రంలో వెనుకబడ్డ ఏడు జిల్లాలకు ప్యాకేజీ ఇవ్వాల్సి ఉందని తెలిపారు. వీటిని సాధించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టుకు నిధుల కేటాయింపులు, విభజన హామీల అమలు, రాజధాని నిర్మాణానికి నిధులు సాధించడంలో వైఎస్ జగన్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విభజన హామీల అమలుకు ఇదే చివరి బడ్జెట్ అని, ఇందులో కూడా రాష్ట్ర ప్రయోజనాల విషయంలో విఫలమైందని అన్నారు. సొంత కేసులు, స్వప్రయోజనాలకు మాత్రమే వైసిపి ఎంపిలు కట్టుబడి ఉన్నారని మరోసారి రుజువైందని విమర్శించారు. 31 మంది ఎంపిలు ఉండి ఏం సాధించారని ప్రశ్నించారు.

సమ్మిళిత అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర బడ్జెట్ ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. పెట్టుబడి వ్యయానికి రూ.13.7 లక్షల కోట్లు కేటాయించడం సానుకూలమని తెలిపారు. 2047 లక్ష్యంగా పథకాలు, కార్యక్రమాల రూపకల్పన దిశగా ఆలోచనలు చేయడాన్ని స్వాగతించారు. విజన్-2047 ద్వారా ప్రపంచ అగ్రగామిగా భారత్ మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగానికి సాంకేతికతను అందించే ప్రణాళికలు.. ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహాన్ని ఇచ్చేలా ఉందన్నారు. ఆదాయపు పన్ను శ్లాబ్‌లలో మార్పులు తెచ్చి వేతన జీవులకు ఊరట కల్పించారని హర్షం వ్యక్తం చేశారు.

ద్రవ్యోల్బణంపై ఊసే లేదు

బాయినేని శ్రీనివాసులు, రిజిస్ట్రార్ ఉర్దూ యూనివర్సిటీ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కేంద్ర బడ్జెట్‌లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, పేద గ్రామీణ కార్మికులు, నిరుద్యోగులకు ఉపాధి, ద్రవ్యోల్బణం గురించి ప్రస్తావన లేకపోవడం కార్మిక, నిర్యుద్యోగ, శ్రామికులకు నిరాశ కలిగించింది. "అమత్ కాల్" ద్వారా భారతదేశానికి మార్గనిర్దేశం చేసేందుకు సమ్మిళిత అభివృద్ధి, చివరి మైలుకు చేరుకోవడం, మౌలిక సదుపాయాలు , పెట్టుబడి, సంభావ్యత, హరితవృద్ధి, యువశక్తి , ఆర్థిక రంగాన్ని ఆవిష్కరించడం అనే ఏడు ప్రాధాన్యతలను బడ్జెట్ లక్ష్యంగా నిర్దేశించడం అభినందనీయం. పన్ను మినహాయింపు విషయంలో కేంద్ర ప్రభుత్వం కల్పించిన వెసులుబాటుతో పన్ను చెల్లింపుదారులు, ఉద్యోగుల్లో ఆనందాన్ని నింపింది. విద్య, నైపుణ్యం రంగంలో ప్రతి జిల్లాలో విద్య , శిక్షణా సంస్థల ద్వారా ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు కేంద్రాలను పునరుద్ధరించడం హర్షించదగ్గ విషయమన్నారు. పిల్లలు , యుక్తవయస్సుల వారి కోసం నేషనల్ డిజిటల్ లైబ్రరీని ఏర్పాటు చేయడం జ్ఞాన సముపార్జనకు తొలి మెట్టు అన్నారు.

రాష్ట్రానికి మరోసారి మొండిచేయి

- కొనసాగుతున్న బిజెపి విద్రోహం
- బడ్జెట్‌ను నిరసించాలి
- సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్రం ఎప్పటి మాదిరిగానే 2023-24 బడ్జెట్‌లోనూ ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేసిందని సిపిఎం రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు బుధవారం ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రజల హక్కయిన 'ప్రత్యేక హోదా'కు మొండిచెయ్యి చూపిందని, విభజన హామీలను పూర్తిగా అటకెక్కించిందని వివరించారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి బాధ్యతను మొసలి కన్నీరుకార్చిన ప్రధాని ఎనిమిదేళ్లుగా ద్రోహం చేస్తూనే వచ్చారని, రాష్ట్ర అభివృద్ధిని అదానికి బిజెపి తాకట్టుపెట్టిందని విమర్శించారు. విశాఖ రైల్వే జోన్, కడప ఉక్కు ఫ్యాక్టరీ వంటి వాటి ఊసెత్తలేదని, ప్రభుత్వ రంగంలో ఉన్న విశాఖ ఉక్కును బలపర్చుకోడానికి ఎలాంటి ప్రతిపాదనా లేదని తెలిపారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ, ప్రకాశం జిల్లా వంటి వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఎలాంటి నిధులూ కేటాయించలేదని, ప్రతిష్టాత్మక విద్యాసంస్థల సంగతీ అలాగే ఉందని పేర్కొన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల గిరిజన విశ్వవిద్యాలయాలకు 2022-23 సంవత్సర బడ్జెట్ కన్నా 15 శాతం కోత విధించడం అమానుషమని పేర్కొన్నారు. మొత్తం 62 పేజీల బడ్జెట్ ప్రసంగంలో ఆర్థికశాఖ మంత్రి ఆంధ్రప్రదేశ్ అన్నమాటనే ఉచ్ఛరించకపోవడం దారుణమని, ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కర్ణాటకు కొత్తగా ప్రత్యేక కేటాయింపులు చేసిన కేంద్రం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరాన్ని నిర్లక్ష్యం చేసిందని పేర్కొన్నారు. నిర్వాసితులకు మొండిచేయి చూపించారని, రాజధాని అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారని, అమరావతికి తొంటిచేయి చూపారని తెలిపారు. ఉపాధి హామీ కేటాయింపుల్లో సగం కోతపెట్టడం, ఆహారం, ఎరువులపై సబ్సిడీలను ఘోరంగా కుదించడం వల్ల సామాన్యులు తీవ్ర ఇక్కట్లపాలవుతారని వివరించారు. విద్యుత్ సంస్కరణలు, పట్టణాల్లో యూజర్ ఛార్జీలు వంటివి జనం నడ్డివిరుస్తాయని, ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమానికి నామమాత్రపు కేటాయింపులు చేసిందని తెలిపారు. దేశంలో 16 శాతం ఉన్న షెడ్యూల్డ్ తరగతులకు 3.5 శాతం మాత్రమే బడ్జెట్‌లో కేటాయించారని, 8.6 శాతంగా ఉన్న షెడ్యూల్డ్ జాతులకు 2.7 శాతం మాత్రమే కేటాయించారని వివరించారు. సబ్‌ప్లాన్ గురించి ప్రస్తావనే లేదని, ఆ తరగతులకు ఈ బడ్జెట్ పూర్తిగా అన్యాయం చేసిందని విమర్శించారు. రాష్ట్రానికి తీవ్ర నిరాశ కలిగించిన కేంద్ర బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం, ప్రధాన ప్రతిపక్షం వ్యతిరేకించాలని కోరారు. ద్రోహపూరిత బడ్జెట్‌ను నిరసించవలసిందిగా ప్రజలకు రాష్ట్ర కమిటీ తరపున విజ్ఞప్తి చేశారు.

కార్పొరేట్లపై పన్నులు విధించాలి

- ప్రాంతీయ వైషమ్యాలను పెంచడం దారుణం
- ప్రజాసమస్యల పరిష్కారానికి కార్యాచరణ : ఎంఎ గఫూర్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి



సామాన్య ప్రజలపై పన్నులు పెంచితే దేశవ్యాప్త నిరసనలు, ఉద్యమాలు చేపడతామని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ పేర్కొన్నారు. కడపలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ధనవంతులకు పన్నులు తగ్గిస్తూ, సామాన్యులపై పన్నులు పెంచుతూ ధనిక, పేదల మధ్య అంతరాన్ని ఉద్దేశపూర్వకంగానే కేంద్రం సృష్టిస్తోందన్నారు. దేశంలో ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభాలు దేశాన్ని మాంద్యం దిశగా తీసుకెళ్తున్నాయని, పాలకులు మేలుకోవాలని హెచ్చరించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, పాలు, పెరుగు వంటి వినియోగాలపై పన్నులు వేయడం తగదన్నారు. అదానీ, అంబానీ వంటి బిలియనీర్ల సంపదపై పన్ను పెంచాలని డిమాండ్ చేశారు. డొల్ల కంపెనీల బండారాన్ని హిడెన్‌బర్గ్ బయటపెట్టడంతో కార్పొరేట్ల బండారం మరోసారి బహిర్గతమైందని తెలిపారు. డొల్ల కంపెనీల కారణంగా ఎల్ఐసి, ఎస్‌బిఐ షేర్లు నష్టపోయాయని చెప్పారు. డొల్ల కంపెనీల వ్యవహారంపై సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో సెబీ, ఇతర సంస్థల సహాయంతో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇటీవల ప్రకటించిన విధంగా విశాఖపట్నం వెళ్లడానికి ఎవరికి ఇబ్బంది లేదని, రాజధాని మారుస్తామనడం మీసొంత జాగీరు కాదని, సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వాల్సి ఉందని గుర్తు చేశారు. ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర పేరుతో చిచ్చు రాజేయడం తగదని, చివరికి బూమరాంగ్ అవుతుందని హెచ్చరించారు. రాబోయే మూడు నెలల కాలానికి సంబంధించిన ప్రజాసమస్యలపై ఉద్యమ కార్యాచరణకు రూపకల్పన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఐఎన్ సుబ్బమ్మ, ఎ.రామమోహన్, బి.మనోహర్ పాల్గొన్నారు.

ఇది కార్మిక, ప్రజా వ్యతిరేక బడ్జెట్

- సిఐటియు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టినది కార్మిక, ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని సిఐటియు రాష్ట్ర కమిటీ విమర్శించింది. ఆ బడ్జెట్ కార్మికులు, రైతులు, శ్రమజీవులు, ప్రజలకు పూర్తిగా వ్యతిరేకంగా ఉందని యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నర్సింగరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలోని నిరుద్యోగాన్ని పోగొట్టేందుకు, పెరుగుతున్న ధరలను తగ్గించేందుకు, దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి ఈ బడ్జెట్ సహాయపడదని అన్నారు. కేవలం ప్రైవేటు పెట్టుబడులకు అనుకూలంగా ఉన్న బడ్జెట్‌ను తిరస్కరించాలని కోరారు. కార్మికుల కోర్కెలకు ఈ బడ్జెట్ ఎటువంటి పరిష్కారమూ చూపలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన ఐసిడిఎస్, మధ్యాహ్న భోజనం, జాతీయ ఆరోగ్య మిషన్, జాతీయ విద్యామిషన్, జాతీయ జీవనోపాధుల మిషన్‌కు మోడీ ప్రభుత్వం కేటాయింపులు పెంచలేదని విమర్శించారు. గ్రామీణ ఉపాధికి కేటాయింపుల్లో తీవ్రంగా కోతపెట్టిందన్నారు. అసంఘటిత కార్మికుల సంక్షేమానికి పెద్దఎత్తున నిధులను కేటాయించి, సంక్షేమ పథకాలను కార్మికులందరికీ అమలు చేయాలన్న కోర్కెను కూడా పట్టించుకోలేదని తెలిపారు. ఇపిఎస్ పెన్షనర్లకు ఎటువంటి కేటాయింపులూ చేయలేదన్నారు. తన తీరుకు తగ్గట్లుగా మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను కొనసాగిస్తోందని విమర్శించారు. నగరాలు, పట్టణాల మౌలిక సౌకర్యాల అభివృద్ధికి నిధులు కేటాయించిన ప్రభుత్వం.. ఆ సౌకర్యాలను అందుకోవాలంటే ప్రజలు యూజర్ ఛార్జీలు చెల్లించాలని మెలిక పెట్టిందన్నారు.

6న కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



మాట్లాడుతున్న సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

ఈనెల 6న కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాలో అధిక సంఖ్యలో ప్రజలు టిడ్కో గృహాల లబ్ధిదారులు, జగనన్న కాలనీల లబ్ధిదారులు, సిపిఐ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య కోరారు. సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన నవరత్నాలలో భాగంగా రాష్ట్రంలోని అందరికీ ఇల్లు పేరుతో నిర్మాణం చేపడతామని చెప్పారన్నారు. 2019 జులై 1న రాష్ట్రవ్యాప్తంగా 9024 జగనన్న కాలనీ నాలుగేళ్లలో 27 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ మొదటి విడత 2019 ఆగస్టు 26 నాటికి 15 లక్షల ఇల్లు పూర్తిచేయాలని పెట్టుకున్న లక్ష్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని ఆయన విమర్శించారు. జగనన్న కాలనీలో అవసరమైన మౌలిక సదుపాయాలను ఏమాత్రం కల్పించలేదని అంతేకాకుండా నిర్మాణ సామాగ్రి ధరలు అమాంతం పెరిగిన నేపథ్యంలో ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే సిమెంటు స్టీలు ఇటుకలు ఇసుక కంకరతో పాటు కూలి రేట్లు కూడా పెరిగాయని, అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.1 లక్షా 80 వేలు ఏమాత్రం సరిపోక ఇల్లు నిర్మాణ దిశలోనే ఆగి పోయాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జగనన్న కాలనీ లబ్ధిదారులకి 5 లక్షల రూపాయలు ఇవ్వాలని వాటితో పాటు ఇసుక, సిమెంటు, స్టీలు, కంకర ఉచితంగా పంపిణీ చేయాలన్నారు. అదేవిధంగా టిడ్కో గహాల కోసం పేద ప్రజలు ఎన్నో ఆశలతో ఎదురుచూస్తూ ఉన్న రాష్ట్ర ప్రభుత్వం మూడు సంవత్సరాలు దాటినప్పటికీ లబ్ధిదారులకు అప్పజెప్పక పోవడం దుర్మార్గమని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం టిడ్కో గహాలను లబ్ధిదారులకు అప్పజెప్పాలన్నారు. ఈడిమాండ్లతో ఈనెల 6న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళనకు సిపిఐ దిగిందన్నారు.

వాల్మీకి బోయ సేవా సంస్థ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



వాల్మీక బోయసేవా సంస్థ డైరీని ఆవిష్కరిస్తున్న అతిథులు

కర్నూలు నగరంలోని బిర్లా కాంపౌండ్‌లో కృష్ణ కాంత్ ప్లాజాలో వాల్మీకి బోయసేవా సంస్థ కార్యాలయంలో వాల్మీకి బోయ సేవా సంస్థ 2023 నూతన డైరీని సంస్థ అధ్యక్షుడు తలారి కృష్ణ నాయుడు అధ్యక్షతన ఈ డైరీ ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ జి.భవాని ప్రసాద్ , డా కె.రామచంద్ర నాయుడు ,రాయలసీమ జోన్ హోంగార్డ్ ఎస్‌పిఎం.మహేష్ కుమార్ ,సంస్థ వ్యవస్థాపక గౌరవ అధ్యక్షులు కుబేరస్వామి ,అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సాంబశివ, కర్నూలు జిల్లా దిశ మహిళా స్టేషన్ డిఎస్‌పి వెంకటరామయ్య, వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయ చైర్మన్ బేతం కృష్ణుడు, వాల్మీకి యోగ కేంద్ర శిక్షకురాలు బిటి.జయలక్ష్మి, సంస్థ గౌరవాధ్యక్షులు చంద్రయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ వీర వసంత్, సంస్థ ప్రధాన కార్యదర్శి బొగ్గుల ఈరన్న పాల్గొని నూతన డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి నాయకులు సత్రం రామకృష్ణ, మార్కాపురం రామాంజినేయులు, కెఎంసి మేనేజర్ చిన్న రాముడు, డాక్టర్ మల్లన్న తదితర సుమారుగా 100 మంది వాల్మీకి నాయకులు పాల్గొన్నారు.

జిల్లాలో 83శాతం పెన్షన్ల పంపిణీ

మొరాయించిన సర్వర్

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లాలో వైఎస్ఆర్ పెన్షన్ కానుక కింద లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీకి సర్వర్ సరిగ్గా పనిచేయక కొంత మొరాయించాయి. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు వాలంటీర్లు పెన్షన్ల మంజూరుకు సంబంధించిన యాప్ సరిగ్గా పని చేయకపోవడంతో ఇబ్బందులకు గురయ్యారు. జిల్లాలో మొత్తం వైఎస్ఆర్ పెన్షన్ కానుక కింద 2,39,934 పెన్షన్లు ఉండగా అందులో 1,97,566 పెన్షన్లు మాత్రమే పంపిణీ చేశారు. పెన్షన్ పంపిణీలో దాదాపుగా 83 శాతం పూర్తి చేశారు. రాత్రి వరకు పెన్షన్లను మాత్రం లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

అప్పర్ భద్రతో రాయలసీమ ప్రాజెక్టులకు ముప్పు !

- అభ్యంతరాలున్నా.. బడ్జెట్‌లో రూ.5300 కోట్లు
- సంక్షోభంలోకి కెసి కెనాల్, ఎల్‌ఎల్‌సి, హెచ్‌ఎల్‌సి, ఆర్‌డిఎస్ ఆయకట్టు
- ఇరు రాష్ట్రాల కరువు ప్రాంతాల మధ్య చిచ్చురాజే యత్నం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నిత్యం కరువు కాటకాలకు గురయ్యే రాయలసీమ ప్రాంతంలో తుంగభద్ర దిగువకాలువ, ఎగువ కాలువ, కెసి కెనాల్ కింద ఉన్న ఆయకట్టును సంక్షోభంలోకి నెట్టేలా కర్ణాటక ప్రభుత్వం చేపట్టిన అప్పర్ భద్ర ప్రాజెక్టుకు కేంద్ర బడ్జెట్‌లో రూ.5,300 కోట్ల నిధులను కేటాయించింది. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరానికి నిధులివ్వకుండా ఇబ్బందులు సృష్టిస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం..కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ది పొందేందుకు ఇప్పటికే అభ్యంతరాలున్న అప్పర్ భద్ర ప్రాజెక్టుకు భారీ స్థాయిలో నిధులు కేటాయించడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఇరు రాష్ట్రాలకు చెందిన కరువు ప్రాంతాల మధ్య చిచ్చురాజేసి తద్వారా కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ది పొందాలన్న దుర్బుద్ధితోనే మోడీ సర్కార్ జాతీయ ప్రాజెక్టులను విస్మరించి వివాదస్పద ప్రాజెక్టుకు నిధులు కేటాయించిందని విమర్శలు వస్తున్నాయి. అంతర్జాతీయ సహజ న్యాయసూత్రాలను విస్మరించి కర్ణాటక నిర్మిస్తోన్న అప్పర్ భద్ర ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం ఆది నుంచీ అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నా, వాటిని ఏ మాత్రం లెక్క చేయకుండా ఇప్పుడు ఎన్నికల వేళ నిధులను కేటాయించడం పట్ల రాష్ట్ర రైతాంగం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. తుంగభద్ర ప్రాజెక్టుకు ఎగువన తుంగ నదిపై 17.40 టిఎంసిలను ఎత్తిపోసేలా ఎత్తిపోతల పథకాన్ని, భద్ర నదిపై 29.4 టిఎంసిలను ఎత్తిపోసేలా మరో ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టింది. మొత్తం 5,62,500 ఎకరాలకు సాగునీరు అందించేలా అప్పర్ భద్ర ప్రాజెక్టును రూపొందించారు. అంటే తుంగభద్ర డ్యామ్‌లోకి నీరు రాకముందే ఎత్తిపోతల పథకం ద్వారా 46.8 టిఎంసిల నీటిని కర్ణాటక మళ్లిస్తుంది. తుంగభద్ర డ్యామ్‌పై ఆధారపడి రాయలసీమలోని కర్నూలు, అనంతపురం, కడప ఉమ్మడి జిల్లాల్లో తుంగభద్ర దిగువకాలువ, తుంగభద్ర ఎగువ కాలువ, కెసి కెనాల్ కింద ఆయకట్టు ఉంది. కెసి కెనాల్‌కు ఎక్కువ భాగం శ్రీశైలం బ్యాక్‌వాటర్ నుంచి నీటిని తీసుకుంటున్నా, మిగిలిన ఎల్‌ఎల్‌సి, హెచ్‌ఎల్‌సిలకు తుంగభద్ర డ్యామ్ నుండి వచ్చేనీరే ఆధారం. ఎల్‌ఎల్‌సి కింద కర్నూలు జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్ల కింద 24 టిఎంసిల కేటాయింపులతో 1,51,134 ఎకరాల స్థిరీకరించిన ఆయకట్టు ఉంది. కర్ణాటకలో జరుగుతున్న జలచౌర్యంతో ఈ ఆయకట్టులో 50 వేల ఎకరాలకు కూడా సక్రమంగా నీరు అందని పరిస్థితి ఉంది. తుంగభద్ర ఎగువకాలువ కింద 42.5 టిఎంసిలతో కర్నూలు జిల్లాలో 14,774 ఎకరాలు, అనంతపురం జిల్లాలో 1,38,804 ఎకరాలు, కడప జిల్లాలో 1,40,600 ఎకరాల స్థిరీకరించిన ఆయకట్టు ఉంటే ఇప్పుడు లక్ష ఎకరాలకు కూడా సక్రమంగా నీరు అందని పరిస్థితి ఉంది. తుంగభద్ర డ్యామ్ కింద ఉండే ఎల్‌ఎల్‌సి, హెచ్‌ఎల్‌సిల కింద ఉన్న ఆయకట్టు భూములకు ఇప్పుడే సగం ఆయకట్టుకు కూడా నీరు అందని పరిస్థితులు ఏటా ఎదురవుతుంటే, అప్పర్ ప్రాజెక్టు పూర్తయితే రాయలసీమలోని ఈ ఆయకట్టు అంతా ఎడారిగా మారే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తెలంగాణలో ఆర్‌డిఎస్ కింద ఉన్న 75 వేల ఎకరాల పరిస్థితి కూడా అప్పర్ భద్ర ప్రాజెక్టుతో ప్రశ్నార్థకంగా మారింది. తుంగభద్ర ప్రాజెక్టు కింద ఉన్న దిగువ ప్రాంత రైతుల హక్కులను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా కేవలం ఎన్నికల లబ్ధి కోసం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అప్పర్ ప్రాజెక్టుకు నిధులు కేటాయించడం పట్ల రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

కరువు ప్రాంతాన్ని విస్మరించడం తగదు : జి ఓబులు, రాయలసీమ సబ్ కమిటీ సభ్యులు

ప్రతిఏటా వర్షాభావ పరిస్థితులతో కరువు పరిస్థితులను ఎదుర్కొనే రాయలసీమ ప్రాంతానికి ఉన్న ప్రధాన నీటి వనరు తుంగభద్ర డ్యామ్. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు తుంగభద్ర డ్యామ్‌లోకి నీరు రాకముందే నీటిని మళ్లించేలా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ వైఖరిపై రాష్ట్ర బిజెపి స్పందించాలి. ఈ చర్యతో రాయలసీమలో మరింత దుర్భిక్ష పరిస్థితులు నెలకొనే ప్రమాదం ఉంది. తుంగభద్ర నీటిలో ఆంధ్రప్రదేశ్‌కు బచావత్ కేటాయించిన వాటా నీటికి గ్యారెంటీ ఇవ్వకుండా కొత్త ప్రాజెక్టులను చేపట్టడం బిజెపి ద్వంద్వ వైఖరి చూపుతోంది.

పార్టీ కోసం కన్వీనర్లు కృషి చేయాలి పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి

ప్రజాశక్తి-తుగ్గలి

రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన వైసిపి పార్టీ కోసం సచివాలయం కన్వీనర్లు తమ వంతు కృషి చేయాలని పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి అన్నారు. బుధవాం జొన్నగిరి గ్రామంలో మండలంలోని సచివాలయం కన్వీనర్లకు ,వాలంటీర్లకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే శ్రీదేవి మాట్లాడుతూ పార్టీ ప్రతిష్ట కోసం ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లి వారికి అవగాహన కల్పించాలన్నారు. ఏ ప్రభుత్వం చేయని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్ని సంక్షేమ పథకాలను ఇంటికి చేర్చుకున్నామన్నారు. సచివాలయం కన్వీనర్లు మండల కన్వీనర్ ప్రత్యేక చొరవ తీసుకుని సంక్షేమ పథకాలకు అవగాహన నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, మండల కమిటీ అధ్యక్షులు జిట్టా నగేష్ యాదవ్, మండల సచివాలయం కన్వీనర్ హనుమంతు, వర్క్ బోర్డ్ డైరెక్టర్ టిఎండి ఉసేని, మోహన్ రెడ్డి, వైస్ ఎంపిపి ఎర్ర నాగప్ప, రైతు ఉత్పత్తి దారుల సంఘం చైర్మన్ సోమేశ్వర్ రెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ గుంత రాఘవేంద్ర, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ గుంత దేవి, నాయకులు పక్కీరప్ప,తేరప్ప, భాస్కర్ రెడ్డి, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరము గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కుష్టు వ్యాధి పై అవగాహన

ప్రజాశక్తి-మద్దికెర

కుష్టు వ్యాధి పట్ల సమాజంలో అవగాహన పెంచడానికి మహాత్మగాంధి వర్ధంతి జనవరి 30 వ తేదీ నుండి 13 ఫిబ్రవరి వరకు మండల పరిధిలో ప్రతి సచివాలయంలో క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్‌నగేష్ తెలిపారు. బుధవారం హంప గ్రామంలో సచివాలయం , అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి కుష్టు వ్యాధిపై జరిగే స్పర్శ అవగాహన కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలో పర్యటించి అనుమానాస్పద కేసులను పరీక్షించి కుష్టు వ్యాధి లక్షణాలపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమం లో హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నిరంజన్‌బాబు, హెల్త్ ప్రొవైడర్ దివ్య, సచివాలయ హెల్త్ సెక్రెటరీ నాగమని, హెల్త్ అసిస్టెంట్ ప్రకాష్‌రావు, ఆశాకార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెన్షన్ల పంపిణీని పరిశీలించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి -కోడుమూరు

కోడుమూరు మండలంలోని ఆమడగుంట్ల, ఎర్రదొడ్డి గ్రామాల్లోని సచివాలయంలు మంగళవారం కోడుమూరు ఎంపిడిఒ చంద్రశేఖర్ సందర్శించి పెన్షన్ పంపిణీపై తనిఖీ నిర్వహించారు. సచివాలయంలయాల ఆయుష్మాన్ భారత్ ఇంటింటి సర్వేను పూర్తి చేయాలని, కళ్యాణమస్తు అర్హత కలిగిన వారికి గుర్తించి చేయాలన్నారు. ఎర్రదొడ్డి జగనన్న హౌసింగ్ లేఔట్‌లో ఆర్‌సి, ఆర్‌వన్‌లో ఉన్నవాటిని త్వరగా పూర్తి చేయాల్సిందిగా, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు.

నాణ్యమైన మధ్యాహ్నం భోజనం అందించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-మద్దికెర

మండల కేంద్రంలో స్థానిక కెవిఆర్ బాలికల పాఠశాల , కొండమ్మ బావి దగ్గర గల ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం ఎస్ఎఫ్ఐ నాయకులు బుధవారం పరిశీలించారు. మండల అధ్యక్షుడు వంశీ మాట్లాడుతూ నూతనంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జగనన్న గోరుముద్ద పథకంలో ఉన్న మెనూ ప్రకారమే సరైన భోజనం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు వంశీ, మండల ఉపాధ్యక్షుడు పీరా, మండల సహాయ కార్యదర్శి ఆకాశ్ పాల్గొన్నారు.





సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

మరో సారి మొండిచేయి..!

- కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు శూన్యం
- వేతన జీవులకూ నిరాశే

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/నంద్యాల కలెక్టరేట్

కేంద్ర బడ్జెట్ మొండిచేయి చూపించింది. జిల్లా ప్రాజెక్టుల ప్రస్తావన ఎక్కడా కనిపించలేదు. జిల్లాకు కేటాయింపులు శూన్యంగానే కనిపించాయి. రైల్వే బడ్జెట్‌లోనూ జిల్లాకు కేటాయింపులు దక్కలేదు. చివరికి వేతన జీవులకూ నిరాశే మిగిలింది..

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 2023-24 బడ్జెట్‌ను బుధవారం రూ.45 లక్షల కోట్లతో ప్రవేశపెట్టారు. చట్టబద్ధమైన హామీలను విస్మరించి ప్రయివేటీకరణ పేరుతో కార్పొరేట్ల భజన చేసింది. ఎంఎస్‌ఎంఇలకు ప్రోత్సాహకాలు, అద్దె వ్యవసాయ పనిముట్ల, ప్రకృతి వ్యవసాయాన్ని ఉటంకించింది. ఫలితంగా ఉద్యోగులకు నిరాశే మిగిలింది. బడా పారిశ్రామిక వేత్తలకు లబ్ది చేకూరేలా బడ్జెట్ ఉంది. గ్రామీణ పేదల ఊసే లేదు. గ్రామీణ ఉపాధి హామీ, గ్రామీణ పేద కార్మికులు, ఉద్యోగాలు, ద్రవ్యోల్బణం ఊసే లేదని కేంద్ర బడ్జెట్లో జిల్లాలోని ప్రాజెక్టుల ప్రస్తావన కరువైంది. జిల్లాలోని పెండింగ్ రైల్వే ప్రాజెక్టులు కేటాయింపులు అతీ గతీ లేదు. రంగాల వారీగా పద్దుల ప్రకటించడం మినహా స్పష్టత కరువైంది. రాష్ట్ర విభజన జరిగిన ఏడేళ్ల గడిచిన నేపథ్యంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధుల విడుదల జాడే కనిపించలేదు.

రైల్వేపై చిన్నచూపు..

రైల్వే ప్రాజెక్టులపై కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో చిన్నచూపు చూపించింది. కేంద్ర బడ్జెట్‌లో రైల్వేకు రూ.2.40 లక్షల కోట్లు కేటాయించగా వాటిలో కొత్త రైళ్లు, కొత్త రైల్వే లైన్లకు ఒక్క పైసా కూడా కేటాయించలేదు. కర్నూలు సిటీ రైల్వే స్టేషన్ నుంచి విజయవాడ మీదుగా మచిలీపట్నం వరకూ రైలు ఉన్నప్పటికీ అది రెండు రోజులకు ఒకసారి నడుస్తోంది. దాన్ని రోజూ నడపాలన్న డిమాండ్ ప్రజల నుంచి వ్యక్తం అవుతోంది. కాచిగూడ నుంచి గుంటూరుకు నడిచే ఎక్స్‌ప్రెస్ రైలును విజయవాడ వరకూ పొడిగించాలన్న ప్రజల ఆకాంక్ష నెరవేరలేదు. కర్నూలు నుంచి నంద్యాలకు వెళ్లాలంటే డోన్ మీదుగా వెళ్లాల్సి వస్తుండటంతో సమయం ఎక్కువ పడుతోంది. కర్నూలు నుంచి ఓర్వకల్లు, పాణ్యం మీదుగా నంద్యాలకు కొత్తగా రైల్వే లైన్ వేస్తే ప్రయాణ సమయం తగ్గిపోనుంది. జిల్లాలోని పుణ్యక్షేత్రాలను కలిపేలా మంత్రాలయం - కర్నూలు - శ్రీశైలం కొత్త రైల్వే లైన్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఎన్నో ఏళ్లుగా ఉంది. అయితే బడ్జెట్‌లో వీటి ప్రస్తావన ఏ మాత్రం లేకుండా పోయింది.

కోచ్ ఫ్యాక్టరీకి శూన్యం..

కర్నూలు సమీపంలో ఏర్పాటు చేయనున్న రైల్వే కోచ్ తయారీ ఫ్యాక్టరీకి కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు శూన్యమే. మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని ఆలంపూర్ రోడ్డు, కర్నూలు జిల్లా పరిధిలోని ఇ.తాండ్రపాడు, పంచలింగాల పరిధిలో ఈ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. రూ.562 కోట్లతో 123 ఎకరాల్లో దాని ఏర్పాటు పనులను ప్రారంభించారు. అవసరమైన స్థాయిలో నిధులు కేటాయించకపోవడంతో ఈ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ పనులు ముందుకు సాగడం లేదు.

ట్రిపుల్ ఐటి డిఎం ప్రస్తావన మాత్రమే..

జిల్లాలోని ఐఐఐటి డిఎంను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని కేంద్ర బడ్జెట్‌లో పేర్కొన్నా నిధుల కేటాయింపుల విషయంలో స్పష్టత కొరవడింది. ఆ సంస్థ స్థాపించినప్పటి నుంచి కేంద్ర బడ్జెట్‌లో ఇదే మాట చెబుతున్నా అభివృద్ధికి నిధులు మాత్రం కేటాయించడం లేదు.

GOVERNMENT OF INDIA

BUDGET 2023-2024

నిరుద్యోగులను, రైతులను ఆదుకోని కేంద్ర బడ్జెట్



2023-24 కేంద్ర బడ్జెట్‌లో నిరుద్యోగ యువతకు కేంద్రం మొండి చేయి చూపింది. కేంద్ర ప్రభుత్వ ఇచ్చిన వాగ్దానం ప్రకారం 11 లక్షలకు పైగా ఉద్యోగాలు కల్పించాల్సి ఉండగా కేవలం 38 వేల టీచర్ పోస్టులు ప్రకటించి నిరుద్యోగులను మోసం చేసింది. టూరిజం స్పాట్స్ డెవలప్ చేస్తున్నామని, అక్కడ ఉద్యోగాలు వస్తాయని, స్కిల్ డెవలప్ సెంటర్స్ ఏర్పాటు చేస్తున్నామని, అక్కడ శిక్షణ పొంది తర్వాత ఉద్యోగాలు వెతుక్కోమని చెప్పేసి నిరుద్యోగులను నిలువునా ముంచింది. వ్యవసాయ రంగానికి, రైతులకు ఈ బడ్జెట్ మొండి చేయి చూపింది. బిజెపి ప్రభుత్వ హయాంలో ఈ నాలుగు సంవత్సరాల కాలంలో రెండు లక్షల మంది రైతులు అప్పుల బాధలతో ఆత్మహత్యలు చేసుకున్నారు. రైతులకు రుణ విమోచన పథకం ఏదైనా బడ్జెట్లో ఉంటుందేమో అని ఆశతో ఎదురుచూసిన నిరాశ ఎదురయింది. మార్కెట్లో రుణాలు ఇస్తాం, తీసుకుని ఇంకా అప్పులపాలు కండి అని అంటున్నారు తప్ప రుణమాఫీ గురించి మాట్లాడకపోవడం తీవ్ర ఆవేదన కలిగించింది. స్వయానా ప్రధానమంత్రి రాతపూర్వకంగా ఢిల్లీ ఉద్యమ సందర్భంగా హామీలు ఇచ్చారు కానీ కనీస అమలు కూడా బడ్జెట్లో నోచుకోలేదు. ఈ బడ్జెట్లో ధరలు ఏమాత్రం తగ్గించలేదు. జనాభా ప్రాతిపదికగా నిధులు కేటాయించాల్సిన కేంద్ర బడ్జెట్లో దళితులకు కేవలం 15 వేల కోట్లు, గిరిజనులకు కేవలం 10 వేల కోట్లు కేటాయించి చేతులు దులుపుకుంది. రాష్ట్ర విభజన హామీల గురించి బడ్జెట్లో మాట్లాడకపోవడం రాష్ట్ర ప్రజలను అవమానపరచడమే.

- సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్

ప్రజా, రైతు వ్యతిరేక బడ్జెట్



ఈ బడ్జెట్ ప్రజా, రైతు వ్యతిరేకమైనది. రాష్ట్రానికి మోసం చేసిన బడ్జెట్. 2023లో జరుగుతున్న రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను గమనంలో ఉంచుకొని ప్రవేశపెట్టింది తప్ప ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు ఊసే లేదు. రాష్ట్రానికి పూర్తిగా అన్యాయం జరిగింది. ఈ బడ్జెట్ వలన రాబోయే రోజుల్లో ధరలు మరింత పెరిగే ప్రమాదం ఉంది. అంబానీ లాంటి కార్పొరేట్ సంస్థలకు మరింత లాభాలు తెచ్చే విధంగా ఉంది. రైతులకు బ్యాంకు రుణాలు, ఎరువులు, పురుగు మందులు, పంటల బీమా, ఇరిగేషన్ వ్యవస్థ మెరుగుదల, గిట్టుబాటు ధరల అమలు ప్రస్తావించకపోవడం విచారకరం.

- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు.

మధ్య తరగతి ప్రజలకు మేలు జరగలేదు



కేంద్ర బడ్జెట్‌లో పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు జరిగేలా లేదు. పెరిగిన ధరలు అదుపు చేసేందుకు ఏ చర్యలు తీసుకుంటున్నారో ప్రస్తావన రాకపోవడం దురదృష్టకరం. బంగారంపై కస్టమ్స్ డ్యూటీ పెంచడం ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది. వ్యవసాయరంగానికి కూడా నామమాత్రపు నిధులు కేటాయించి చేతులు దులుపుకుంది. బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసేవిలా ఉంది.

- టిడిపి నంద్యాల పట్టణ అధ్యక్షులు మనియార్ ఖలీల్.

సీమ అభివృద్ధికి నిధుల ఊసే లేదు




కేంద్ర బడ్జెట్‌లో రైతులు, వ్యవసాయ రంగానికి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదు. నిరుద్యోగులకు, చిన్న తరహా పరిశ్రమలకు, చేతివృత్తుల వారిని నిరాశ పరిచింది. అనంతపురంలో సెంట్రల్ యూనివర్సిటీకి ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించకపోవడం దారుణం. ఉద్యోగాల భర్తీ ఊసే లేదు. రాయలసీమకు బుందేల్‌ఖండ్ తరహాలో ప్రత్యేక ప్యాకేజీ ఉన్నప్పటికీ కేటాయించకపోవడం కేంద్ర ప్రభుత్వం మరోసారి సీమ ప్రజలను మోసం చేయడమే. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ సంక్షేమాన్ని విస్మరించారు. ఈ సంవత్సరం తొమ్మిది రాష్ట్రాల్లో జరగనున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గిరిజనులకు 15 వేల కోట్లు కేటాయింపు చేశారు. ఎపికి ఒరగబెట్టిందేమీ లేదు. ఇది అంకెల గారడి బడ్జెట్. ఎపికి సీతాపతి చిప్పే గతి అన్న చందంగా ఉంది.

- కాంగ్రెస్ నంద్యాల పార్లమెంట్ డిసిసి అధ్యక్షులు జె.లక్ష్మి నరసింహ యాదవ్.

విచక్షణాత్మక బడ్జెట్

రాష్ట్రంలో 14 వెనుకబడిన జిల్లాలు ఉంటే రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కర్ణాటకలోని కరువు ప్రాంతాలకు 5 వేల కోట్లు కేటాయించడంతో ఇది విచక్షణాత్మక బడ్జెట్‌గా మారింది. ప్రత్యక్ష, పరోక్ష పన్నుల రూపంలో కేంద్ర ప్రభుత్వానికి ఆదాయాన్ని ఇస్తున్న దక్షణాది రాష్ట్రాలకు కేటాయింపులు శూన్యం. ఉద్యోగస్తులకు చూపిన ఆదాయపు పన్ను ఊరట ఒకమాయ. సాబ్ విధానాన్ని సవరించక కొత్త ఆదాయ పన్ను విధానాన్ని ప్రకటించడం ద్వారా ప్రయోజనం పొందే ఉద్దేశం కనిపిస్తుంది కాని ఒరిగిందేమీ లేదు. రాష్ట్ర విభజన తర్వాత వచ్చిన 9వ కేంద్ర బడ్జెట్లో కూడా రాష్ట్రానికి సహాయం ఊసులేదు. కోవిడ్ మహమ్మారి కారణంగా దెబ్బతిన్న రాష్ట్రాలు, రంగాల గురించిన ప్రస్తావన లేదు. ఆర్థిక వ్యవస్థలో కీలకంగా ఉన్న సేవారంగం కూడా బడ్జెట్‌లో ప్రాధాన్యత పొంద లేదు. మైనారిటీలు, అణగారిన వర్గాల సంక్షేమం మరచి పోయారు.



- ఆచార్య షేక్ మన్సూర్ రహమాన్, ఆర్థిక వేత్త.

చిరుధాన్యాలపై అవగాహన కల్పించండి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పోషక విలువలు అధికంగా ఉన్న చిరుధాన్యాల పంట ఉత్పత్తులపై రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో ఈ-క్రాఫ్ బుకింగ్, చిరుధాన్యాల ఆహార ఉత్పత్తులపై రైతులకు అవగాహన తదితర అంశాలపై వ్యవసాయ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చిరుధాన్యాల పంటలకు నీటి ఆవశ్యకత తక్కువగా వుండడంతో పాటు అధిక దిగుబడి నేపథ్యంలో రైతుల్లో అవగాహన తీసుకురావాలన్నారు. ప్రజలందరూ పోషకాలు ఉన్న చిరుధాన్యాల ఆహార పదార్థాలపై మక్కువ చూపుతున్నారని ఈ మేరకు వ్యవసాయ అధికారులు ప్రత్యేక కాంపెయిన్‌లు, ర్యాలీలు నిర్వహించి రైతుల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. రబీ పంట కాలానికి సంబంధించి పెండింగ్లో ఉన్న 9 శాతం ఈ క్రాఫ్ బుకింగ్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రైతు భరోసా పిఎం కిసాన్ పెండింగ్లో ఉన్న 27,024 మంది రైతుల ఈకేవైసీని పూర్తి చేయాలన్నారు. రసాయనిక ఎరువులు, విత్తనాలు పక్కదారి పట్టకుండా ఎరువుల దుకాణాలపై విస్తృత దాడులు నిర్వహించి నియంత్రించాలని కలెక్టర్ ఆదేశించారు. సమీక్షలో జాయింట్ కలెక్టర్ టి. నిశాంతి, జిల్లా వ్యవసాయాధికారి మోహన్ రావు, డిఎస్ఓ ఆచార్యులు, నంద్యాల ఎడిఎ రాజశేఖర్, డోన్ ఎడిఎ అశోకవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

3న సంకల్ప దీక్ష

- జయప్రదం చేయండి : యుటిఎఫ్

ప్రజాశక్తి - నంద్యాల

పాత పెన్షన్ విధానమే అమలు చేయాలని కోరుతూ ఈ నెల 3న కృష్ణాజిల్లా గన్నవరం సమీపంలోని ధర్మస్థలి ప్రాంగణంలో యుటిఎఫ్ అధ్వర్యంలో జరిగే సంకల్ప దీక్ష, సభలో ఎక్కువ మంది ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు పివి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి జె.సుధాకర్ కోరారు. బుధవారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో సంకల్ప దీక్ష జయప్రదం కోరుతూ నిర్వహించిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల జీవిత భద్రతకు ముప్పుగా ఉన్న కాంట్రిబ్యూట్ పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరిస్తారని ముఖ్యమంత్రి పాదయాత్రలో ఇచ్చిన హామీ ఇప్పటివరకు నెరవేర్చకపోగా ఇప్పుడు మరో కొత్త జిపిఎస్ విధానాన్ని అమలు చేస్తానని ప్రతిపాదించడం తగదన్నారు. ఈ విధానం వల్ల సిపిఎస్ విధానంలో కంటే కొద్దిపాటి ప్రయోజనాలు ఆధారంగా చేర్చినప్పటికీ అది ఉద్యోగులకు విరమణ అనంతరం భద్రత కలిగించేవిగా లేవన్నారు. ఈ విధానం కూడా సిపిఎస్‌కు మరో రూపమే అని, జిపిఎస్ రెగ్యులర్ ఉద్యోగాల కల్పన తగ్గుతున్న కొద్దీ పాత పెన్షన్ విధానం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై పెద్దగా పడే భారం కూడా లేదన్నారు. పశ్చిమబెంగాల్ రాష్ట్రం మొదటి నుండి పాత పెన్షన్ విధానం కొనసాగిస్తుండగా రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్, పంజాబ్ రాష్ట్రాలు పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాయన్నారు. ఇటీవల ఏర్పడిన హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం పాత పెన్షన్ విధానం పునరుద్ధరిస్తూ నిర్ణయం తీసుకుందన్నారు. పొరుగున ఉన్న తమిళనాడు రాష్ట్రం కూడా 2023 ఏప్రిల్ ఒకటి నుండి పాత పెన్షన్ విధానం అమలు చేస్తారని వార్తలు వస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో జిపిఎస్ విధానం ఆలోచన విరమించుకోవాలని, సిఎం ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని కోరుతూ నిర్వహిస్తున్న సంకల్ప దీక్ష సభకు పలువురు మంత్రులను, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నాయకులను ఆహ్వానిస్తున్నట్లు తెలెఇపారు. సంకల్ప దీక్ష సభకు పెద్ద ఎత్తున ఉద్యోగులు, ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా సహా అధ్యక్షుడు ఎస్.జాకీర్ హుస్సేన్, జిల్లా కార్యదర్శులు ఎం.శాంతి ప్రియ, వివి.రామోహన్, ఎం.సత్య ప్రకాష్, బాబా పక్రుద్దీన్, కె.రామ కృష్ణుడు, ఆడిట్ కమిటీ కన్వనర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి జె.సుధాకర్



సికిందర్ భట్టును సన్మానిస్తున్న నాయకులు

యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

శిరివెళ్ల : యువజన కాంగ్రెస్ విభాగం జిల్లా అధ్యక్షునిగా గోస్పాడు మండలం కానాలపల్లి గ్రామానికి చెందిన సికిందర్ భట్టును పిసిసి అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా ఆయనను సిరివెళ్ల మండలం సింధు వేర్ హౌస్ గోడౌన్ వద్ద శాలువాలతో, పూలమాలలతో బుధవారం ఘనంగా సన్మానించారు. అనంతరం సికిందర్ బట్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ ఇన్చార్జి పుల్లయ్య, పీసీసీ ప్రధాన కార్యదర్శి చింతల మోహన్ రావు, నంద్యాల పట్టణ అధ్యక్షుడు చింతలయ్య, వాసు, బాలకృష్ణ, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

బనగానపల్లె : మండలంలోని పెద్దరాజుపాలెం గ్రామంలో రైతు బోయ రాముడుకు చెందిన గడ్డివామికి బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో పూర్తిగా కాలి బూడిదయింది. వివరాలు.. రైతు బోయ రాముడు రెండు రోజుల క్రితం రెండు ట్రాక్టర్ల జొన్నసొప్పను గార్లదిన్నె గ్రామంలో రూ.40 వేలకు కొనుగోలు చేసి తెచ్చి వామి వేసి ఉంచారు. గడ్డి వామి కాలిపోవడంతో రూ. 40 వేలు నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. అగ్నిమాపక అధికారులు అక్కడికి చేరుకుని మంటలు ఇతర గడ్డివాములకు వ్యాపించకుండా అదుపు చేశారు. రైతు ఫిర్యాదు మేరకు ఎస్సై రామిరెడ్డి సంఘటన ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని రైతు బోయరాముడు కోరారు. గ్రామ సర్పంచ్ మూల మోహన్ బాబు గౌడ్ గ్రామ పెద్దలు కాలిన గడ్డివామిని పరిశీలించారు. రెండు సంవత్సరాల క్రితం ఇదే రైతుకు చెందిన గడ్డివామికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారని గ్రామ ప్రజలు తెలిపారు.

పంట నమోదును ఎఒ తనిఖీ

మహానంది : మండలంలోని మసీదుపురం, సీతారామపురం, గోపవరం గ్రామాలలో గ్రామ వ్యవసాయ సహాయకులు చేస్తున్న పంట నమోదు కార్యక్రమాన్ని మండల వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వర్ రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాటాల్డఉతూ ప్రతి రైతు రబీలో వేసిన పంటలను వెంటనే నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు శిక్షణా కేంద్రం వ్యవసాయ అధికారి ప్రభావతమ్మ, గ్రామ రెవిన్యూ అధికారులు సంజీవరెడ్డి, నరసింహులు, గ్రామ వ్యవసాయ సహాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, లక్ష్మీకాంత్, హరిత, రైతులు పాల్గొన్నారు.

నేడు నెహ్రూనగర్‌కు ఎమ్మెల్యే రాక

పగిడ్యాల : నందికొట్కూరు ఎమ్మెల్యే తోగురు ఆర్థర్ మండలంలోని నెహ్రూనగర్ గ్రామానికి వస్తునట్లు ఎంపిడిఒ వెంకటరమణ బుధవారం తెలిపారు. ఎంపిడిఒ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆర్థర్ నెహ్రూనగర్ గ్రామంలోని సచివాలయ-1 పరిధిలో గడగ గడప మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలని సూచించారు.

జిఒ 1ని రద్దు చేసేవరకూ పోరాటం : సిఐటియు

ప్రజాశక్తి - నంద్యాల

రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జీవో నెంబర్ 1ని రద్దు చేసే వరకూ పోరాటాలు చేస్తామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.నాగరాజు తెలిపారు. బుధవారం సిఐటియు నంద్యాల పట్టణ కమిటీ సమావేశం పట్టణ ఉపాధ్యక్షులు తోటమద్దులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల, ఉద్యోగుల, కార్మికుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ, వాటి గురించి మాట్లాడినా, ర్యాలీలు, సభలు నిర్వహించి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అరెస్టులు తప్పకుండా పోలీస్ రాజ్యాంగం చేయాలని చూస్తున్న సిఎం జగన్మోహన్ రెడ్డి నియంతృత్వ వైఖరిని వీడాలన్నారు. ఎమర్జెన్సీ విధించిన ఇందిరాగాంధీ లాంటి వారే ప్రజలకు క్షమాపణ చెప్పిన మాటలను గుర్తుపెట్టుకోవాలని, లేకుంటే వైసిపిని ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు, ప్రజాతంత్ర వాదులు, లౌకిక శక్తులంతా ఏకమై భూస్థాపితం చేస్తారని హెచ్చరించారు. సమావేశంలో పట్టణ అధ్యక్షులు లక్ష్మణ్, పట్టణ కోశాధికారి వెంకటలింగం, కమిటీ సభ్యులు సునీత, నాగరాణి, జైలాన్, గోపాల్, దస్తగిరి, శ్రీనావాసులు, వీరసేన, రంగా, అంజి, పెద్దన్న, శివుడుతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తోట మద్దులు

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి

- పిడి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని ఆయా గ్రామాలలో ప్రజలు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఉపాధి హామీ పీడీ రామచంద్రరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని ఎల్లావత్తుల గ్రామంలో జరుగుతున్న పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కొక్కరికి 257 రూపాయలు వేతనం వచ్చే విధంగా పనులు చేయించాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో 650 మంది ఉపాధి పనులకు వస్తున్నారన్నారు. మరింత మంది వచ్చేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఎపిఒ ప్రతాప్, ఇసి సుబ్బన్న, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు. **పాములపాడు :** మండలంలోని భానుముక్కల గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీవో విమలమ్మ బుధవారం తనిఖీ చేశారు. మస్టర్‌ను పరిశీలించారు. కూలీలకు సూచనలు చేశారు. కొలత ప్రకారం పని చేస్తే రూ. 250 దాకా దినసరి వేతనం వస్తుందన్నారు. **పగిడ్యాల :** ఉపాధి పనులు కొలతల ప్రకారం పని చేస్తే రూ.257 వేతనం వస్తుందని ఎపిడి అన్వారా బేగం ఉపాధి కూలీలకు సూచించారు. పగిడ్యాల గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎపిడి మాట్లాడారు. కూలీల సంఖ్య పెంచాలని సిబ్బందికి ఆదేశించారు. కూలిలతో నాణ్యమైన పనులు చేయించాలన్నారు. అనంతరం ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎపిఒ మద్దిలేటి, ఇసి ఆశోక్, టిఎలు, ఎఫ్ఎలు పాల్గొన్నారు.



ఉపాధి సిబ్బంది కూలీలతో మాట్లాడుతున్న పీడీ

పథకాలను చూసైనా పట్టం కట్టాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పాణ్యం

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను చూసైనా ప్రజలు మళ్లీ వైసిపికే పట్టం కట్టాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పాణ్యంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు, లబ్దిదారుల సంతృప్తిని అడిగి తెలుసుకున్నారు. పలు కాలనీల్లో వున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి హుస్సేన్ బీ, సర్పంచ్ పల్లవి, వైసిపి నాయకులు సూర్య నారాయణ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, చందమామ బాబు, ఎంపిడిఒ దస్తగిరి తదితరులు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** పట్టణ, గ్రామాల అభివృద్దే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు బాబుల్ రెడ్డి అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని గోర్లగుట్ట గ్రామంలో నాయకులు చలమారెడ్డి, సర్పంచ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ సీతారామ చంద్రుడు, తిరుమలేశ్వర్ రెడ్డి, చంద్రశేఖర్, రామసుబ్బయ్య, గోరుమాన్ కొండ సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు, రామళ్లకోట కృష్ణుడు, కౌన్సిలర్ నాగ వెంకటేశ్వర్లు, మధు, ఎద్దులన్న, మద్దిలేటి పాల్గొన్నారు. **నందికొట్కూరు :** మండలంలోని అల్లూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆర్థర్ పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రతి గడప తిరుగుతూ ప్రజలకు వివరించారు. నాయకులు ప్రభాకర్ రెడ్డి, బ్రాహ్మణ కొట్టుకూరు సింగిల్ విండో చైర్మన్ మద్దూర్ హరిసర్వోత్తమ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

అంగన్వాడీ భవన నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని నరసాపురం గ్రామంలో బుధవారం అంగన్వాడీ భవన నిర్మాణానికి అధికారులు, నాయకులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్త సునీత మాట్లాడుతూ నాడు-నేడు అభివృద్ధి పనుల్లో భాగంగా రూ.16 లక్షల నిధులు మంజూరు అయ్యాయని, అంగన్వాడీ భవన నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి జయరామిరెడ్డి, విఆర్ఒ ఓబయ్య, ఇంజనీర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ అసిస్టెంట్ సునీత, మహిళా పోలీస్ సుజాత, వైసిపి నాయకులు నాగేశ్వరరెడ్డి, లక్ష్మీ నారాయణ రెడ్డి, శివ నాగయ్య, పలువురు నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

భూమి పూజలో పాల్గొన్న అధికారులు, నాయకులు





జాతీయ పోటీలకు వేంపెంట విద్యార్థి

పాములపాడు : వేంపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి వై.రాజ్ కుమార్ అండర్-14 విభాగంలో జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం కృష్ణమూర్తి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గత డిసెంబర్‌లో 28, 29, 30న నంద్యాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలలో రాజ్ కుమార్ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారని చెప్పారు. హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు రాజ్ కుమార్‌ను, వ్యాయామ ఉపాధ్యాయుడు నాగరాజును అభినందించారు.

నేడు శ్రమయేవ జయతే పుస్తకావిష్కరణ

నంద్యాల : స్థానిక రామకృష్ణ డిగ్రీ కాలేజీలోని వివేకానంద ఆడిటోరియంలో నేడు గురువారం శ్రమయేవ జయతే పుస్తకావిష్కరణ జరగనున్నట్లు ప్రముఖ లాయర్, మాజీ కౌన్సిలర్ బి.శంకరయ్య బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జెవివి రాష్ట్ర అధ్యక్షులు వి.బ్రహ్మారెడ్డి, ప్రముఖ రచయిత హరికిషన్, రామకృష్ణ విద్యాసంస్థల అధినేత రామకృష్ణ రెడ్డి హాజరవుతారని తెలిపారు. పట్టణ ప్రజలు, సాహితీ అభిమానులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సంగమేశ్వరాలయంలో తొలి పూజ ప్రారంభం

కొత్తపల్లి : సప్త నదుల సంగమ తీరంలో వెలసిన సంగమేశ్వరాలయంలో తొలి పూజను ఆలయ పురోహితులు తెలక తెలకపల్లి రఘురామ శర్మ ఆధ్వర్యంలో బుధవారం చేశారు. భీష్మ ఏకాదశి రోజు స్వామివారి దర్శనం, తొలి పూజలు ప్రారంభమయ్యాయి. ఈ పూజల్లో శివ స్వాములు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

ఉత్తమ ప్రతిభ కనబరచాలి : డిఇఒ

బండి ఆత్మకూర్ : విద్యార్థులు చదువులో ఉత్తమ ప్రతిభ కనపరిచేలా తయారు చేయాలని నంద్యాల జిల్లా విద్యాధికారి అనురాధ తెలిపారు. బుధవారం మండలంలోని కడమల కాలువ స్పెషల్ ప్రాథమిక పాఠశాలను, చిన్నదేవలాపురంలోని బర్కల ప్రాథమిక పాఠశాల, సంత జూటూరులోని జిల్లా పరిషత్ పాఠశాలను డిఇఒ తనిఖీ చేశారు. నాడు-నేడు పాఠశాలల అభివవృద్ధి పనులను పరిశీలించి, త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఇఒ కరీం బాషా, సీఆర్పీలు రాజశేఖర్, అజ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఇఒ


సాంఘిక సంక్షేమ అధికారిణిని సన్మానిస్తున్న దృశ్యం

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి

ఆళ్లగడ్డ : విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని నంద్యాల జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి చింతామణి అన్నారు. బుధవారం స్థానిక అనంత డిగ్రీ, జూనియర్ కళాశాలలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఆధ్వర్యంలో జిల్లా పరిధిలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహ పదవ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏప్రిల్‌లో జరిగే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు ఏ విధంగా ప్రిపేర్ కావాలనే అవగాహన తరగతులను, ఆయా పాఠ్యాంశాలను సంబంధించిన మేధావులతో అవగాహన కల్పించారు. విద్యార్థులు పాఠ్యాంశాలను కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. అనంతరం జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిణిని ఘనంగా సన్మానించారు. అంతకుముందు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎస్ డబ్ల్యుఒ శ్రీనివాసులు, అనంత విద్యాసంస్థల కరస్పాండెంట్ అనంత రామ సుబ్బారెడ్డి, చైర్మన్ విజయలక్ష్మి, వసతి గృహ సంక్షేమ అధికారులు ముల్లా ఖాదర్ బాషా, చంద్రశేఖర్ రెడ్డి, రాముడు, చాంద్ బాషా, కాశీం సాహెబ్, రామకోటి రెడ్డి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి బి-10 న్యూస్ కృషి

ప్రజాశక్తి - శిరివెళ్ల

ఎపి, తెలంగాణ రాష్ట్రాల్లో మీడియా రంగంలో విశేష ప్రజాభిమానంతో, ప్రజా సమస్యల పరిష్కారానికి బి-10 న్యూస్ కృషి చేస్తుందని బిసి సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఎంబిబి రమణ, ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆళ్లగడ్డ తాలూకా ప్రధాన కార్యదర్శి సల్లేపల్లే మల్లికార్జున రెడ్డి పేర్కొన్నారు. బుధవారం శిరివెళ్లలోని వెలుగు కార్యాలయంలో బి-10 న్యూస్ రిపోర్టర్ గంతి వెంకట సుబ్బయ్య అధ్యక్షతన బి-10 న్యూస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, జర్నలిస్టులు, ప్రజలు పాల్గొన్నారు.

హరినగరంలో వీధిలైట్లు ఏర్పాటు

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని హరినగరం గ్రామంలో వీధిలైట్లు ఏర్పాటు చేసినట్లు వైసిపి నాయకుడు సవరం నాగముని తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా విద్యుత్ సమస్య లేకుండా చేయాలని ప్రజలు కోరడంతో ఆయన స్పందించి కొత్త విద్యుత్ స్తంభాలు, కేబుల్ మంజూరు చేయించి కొన్ని కాలనీలకు విద్యుత్ సౌకర్యం కల్పించారన్నారు. కొత్త స్తంభాలు వేసిన చోట గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో వీధిలైట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.


వీధి లైట్లు వేయిస్తున్న వైసిపి నాయకుడు సవరం నాగముని

ఉపాధికి రూ.2 లక్షల కోట్లు కేటాయించాలి : వ్యకాసం

ప్రజాశక్తి - నందికొట్కూరు

ఉపాధి హామీ పథకానికి రూ. 2 లక్షల కోట్లు కేటాయించాలని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నందికొట్కూరు జైకిసాన్ పార్కులో వ్యకాసం జిల్లా నాయకులు పి.షకీల్ సాహెబ్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం 2005లో వామపక్షాల ఒత్తిడి మేరకు యుపిఎ గవర్నమెంట్ తీసుకువచ్చిందని, పార్లమెంటులో కమ్యూనిస్టుల సంఖ్య తగ్గడంతో చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు 10 శాతం ఉన్న మెటీరియల్ ఖర్చును 40 శాతానికి పెంచడం, బడ్జెట్లో నిధులు తగ్గించడం, ఉపాధికి కేటాయించిన నిధులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇతర రంగాలకు మళ్లిస్తున్నాయని తెలిపారు. 200 రోజులు పని పెట్టి పెరిగిన ధరలకు అనుగుణంగా రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలన్నారు. మున్సిపాలిటీ పట్టణాల్లో ఉపాధి పనులు కల్పించాలన్నారు. ఎన్ఎంఎంఎస్ యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. టిడిపి నాయకులు సైకిల్ అహ్మద్, సిఐటియు జిల్లా నాయకులు కే భాస్కర్ రెడ్డి, గోపాలకృష్ణ, రైతు సంఘం జిల్లా నాయకులు పి వెంకటేశ్వర్లు, బేస్తరాజు, ఎస్సీ ఎస్టీ బీసీ సంఘం నాయకులు ప్రసాద్, మాల మహానాడు టౌన్ అధ్యక్షుడు చరణ్, బుడగ జంగాల నాయకులు రామలింగం, కెవిపిఎస్ నాయకులు రంగమ్మ మాట్లాడారు. ఉపాధి హామీ చట్టంను సమర్థవంతంగా అమలు జరిపేందుకు వ్యవసాయ కార్మిక సంఘం చేసే పోరాటాలకు అన్ని రకాలుగా మద్దతు ఉంటుందని తెలిపారు. సమావేశంలో వ్యకాసం నాయకులు సంపంగి వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, శ్రీనివాసులు, టి.ఓబులేసు, లక్ష్మన్న, మహిళా సంఘం నాయకురాలు నూర్జాన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాయకులు నాగేశ్వరావు

పశుసంవర్ధక శాఖ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని పశువైద్యశాలలో పశుసంవర్ధక శాఖలో పని చేస్తున్న నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నేరీయన్స్ 2023 డైరీ, క్యాలెండర్‌ని బనగానపల్లె పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మారుతి సకారం బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖలో పారా వెటర్నరీ సిబ్బంది పాత్ర అత్యంత ముఖ్యమని కొనియాడారు. ఈ సందర్భంగా డాక్టర్లకు, పారా వెటర్నరీ సిబ్బందికి ముఖ హాజరు నుంచి మినహాయింపు ఇచ్చేలా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని పారా వెటర్నరీ సిబ్బంది కోరారు. కార్యక్రమంలో బనగానపల్లె , అవుకు మండలాల వెటర్నరీ డాక్టర్లు, పారా వెటర్నరీ సిబ్బంది, పశు సంవర్ధక సహాయకులు పాల్గొన్నారు.


పశుసంవర్ధక శాఖ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

కార్మిక, ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను తిరస్కరించండి : సిఐటియు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మికులకు, రైతులకు, శ్రమ జీవులకు, ప్రజలకు పూర్తిగా వ్యతిరేకంగా ఉందని, ఈ బడ్జెట్‌ను ప్రతి ఒక్కరూ తిరస్కరించాలని జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి.ఏసురత్నం, ఏ.నాగరాజులు కోరారు. బుధవారం సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగాన్ని పోగొట్టడానికి కానీ, పెరుగుతున్న ధరలను తగ్గించటానికి గానీ, దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి ఈ బడ్జెట్ సహాయపడదన్నారు. కేవలం ప్రైవేటు పెట్టుబడులకు అనుకూలంగా బడ్జెట్‌గా ఉందని చెప్పారు. అసంఘటిత కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోలేదన్నారు. ఇపిఎస్ పెన్షనర్ల కనీస పెన్షన్ పెంచాలని లక్షలాది మంది వృద్ధాప్యంలో ఉన్న పెన్షనర్లు చేస్తున్న ఆందోళనలు కూడా మోడి చెవికి ఎక్కలేదని విమర్శించారు. రూ.61 వేల కోట్ల మేర ప్రభుత్వ సంస్థలను అమ్మాలని ప్రతిపాదించడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఈ బడ్జెట్లో గొప్పలు చెప్పుకోవటం తప్ప వాస్తవాలకు చోటులేదని, ఈ ప్రజావ్యతిరేక బడ్జెట్‌ను తిరస్కరించాలని కార్మికులకు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి - ప్యాపిలి

ప్యాపిలి మండలం జలదుర్గం గ్రామ పంచాయతీలో తొలగించిన పారిశుధ్య కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శి పోదొడ్డి రామాంజనేయులు, మండల ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ రహిమాన్, పద్మశాలి శ్రీనివాస్‌లు డిమాండ్ చేశారు. బుధవారం జలదుర్గం గ్రామంలోని మురికి కాలువలను వారు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలో 8 మంది కార్మికులు పని చేసేవారని, పంచాయతీలో నిధులు లేవనే సాకుతో నలుగురిని తొలగించారని, ప్రస్తుతం మరో ముగ్గురిని తొలగించి ఒక్కరితోనే కూలి 200 రూపాయలు ఇచ్చి అవసరం ఉన్నప్పుడు గ్రామమంతా మురికి కాల్వలు, చెత్త, రోడ్లు క్లీన్ చేయించుకోవడం దారుణమన్నారు. తక్షణమే గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులను విధుల్లోకి తీసుకొని, వారి అకౌంట్లో జీతాలు చెల్లించాలని, లేని పక్షంలో కార్మికులతో కలిసి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.


మురికి నీటి కాల్వలను పరిశీలిస్తున్న నాయకులు

పాఠశాలను ఎంఇఒ తనిఖీ

ప్రజాశక్తి - పగిడ్యాల

మండలంలోని పడమర వనుములపాడు గ్రామంలోని ఎంపిపి పాఠశాలను ఎంఇఒ సుభాన్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని నిర్వాహకులకు సూచించారు. భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం విద్యార్థుల విద్యాసామర్థ్యాని పరీక్షించారు. విద్యార్థులు విద్యపై శ్రద్ధ పెంపొందించుకోనేలా విద్యను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యలో వెనుకబడ్డ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విద్యను బోధించాలన్నారు. అనంతరం పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు.


డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

అగ్రికల్చర్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లా కలెక్టర్ చాంబర్‌లో అగ్రికల్చర్ అసోసియేషన్ అధికారుల డైరీని, రోజు వారి వ్యవసాయ కార్యకలాపాల క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి టి మోహన్ రావు, ఏడిఏ రాజశేఖర్, వ్యవసాయ అధికారులు అయుబ్ బాషా, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ శంకర్ నాయక్ సస్పెన్షన్ ఎత్తివేయాలి

- పోలీస్ స్టేషన్ ఎదుట జిపిఎస్ ధర్నా

ప్రజాశక్తి - బనగానపల్లె

బనగానపల్లె ఎస్ఐ శంకర్ నాయక్ సస్పెన్షన్ ఎత్తివేయాలని జిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు రాజు నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని పోలీస్ స్టేషన్ ముందు ఎస్సై సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరుతూ గిరిజనులు ధర్నా నిర్వహించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే జనార్ధన్ రెడ్డిపై ఎస్సి ఎస్టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, కడప జిల్లా కమలాపురం ఎస్సై చిన్న పెద్దయ్యపై కేసు నమోదు చేసి సస్పెండ్ చేయాలని ఆళ్లగడ్డ డిఎస్పి సుధాకర్ రెడ్డి కి గిరిజన సంఘం నాయకులు వినతిపత్రం ఇచ్చారు. డిఎస్పి సుధాకర్ రెడ్డి విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని చెప్పడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో ఈశ్వర్ నాయక్, కరివేన రవి నాయక్, జిపిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రవి నాయక్, ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు బాలు నాయక్, నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - చాగలమర్రి

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సెబ్ సిఐ చంద్రమణి సూచించారు. బుధవారం చాగలమర్రి పట్టణంలోని శ్రీ వాసవి డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ అన్నా సత్యనారాయణ ఆధ్వర్యంలో 'డ్రగ్స్ వాడకం - దుష్పరిణామాలు' అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సెబ్ సిఐ మాట్లాడుతూ యువత డ్రగ్స్,మత్తు పదార్థాలకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. ఏఎస్ఐ మేరి జయంతి, వాసవి విద్యా సమాజం కార్యదర్శి ఆదవేని గుప్తా, సహాయ కార్యదర్శి పుల్లారెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి మహేశ్వరయ్య, జిఎమ్ఎస్‌కె ప్రసన్న, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వాలంటీర్లకు స్కానర్లు పంపిణీ

ప్రజాశక్తి - సిరివెళ్ల

మండలంలోని వెంకటాపురం గ్రామ సర్పంచి కందుల మల్లేశ్వరి ప్రసాద్ రెడ్డి వాలంటీర్లకు స్కానర్లు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ నాలుగు స్కానర్లను తన సొంత నిధులతో పంపిణీ చేసినట్లు చెప్పారు. పెన్షన్ల పంపిణీ, ప్రభుత్వ పథకాలు అందించాలన్నా స్కానర్లు చాలా అవసరమన్నారు.


స్కానర్లు పంపిణీ చేస్తున్న సర్పంచి


సిఎం జగన్‌మోహన్ రెడ్డికి స్వామి అమ్మవార్ల జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి, శ్రీశైలం ఎమ్మెల్యే, దేవస్థాన ధర్మకర్త మండలి అధ్యక్షులు, ఇఒ తదితరులు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సిఎంకు ఆహ్వానం

శ్రీశైలం : శ్రీశైలం దేవస్థానంలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఇఒ ఎస్.లవన్నలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని బుధవారం ఆహ్వానించారు. ముఖ్యమంత్రికి వేద ఆశీర్వచనంతో శేషవస్త్రాలు, ప్రసాదాలు, స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, దేవస్థానం క్యాలెండర్లు, డైరీని అందజేశారు.

టిడిపి హయాంలోనే నియోజవర్గ అభివృద్ధి : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆత్మకూర్

శ్రీశైలం నియోజకవర్గం అభివృద్ధి గత టిడిపి పాలనలోనే జరిగిందని, ప్రస్తుతం ఏమీ లేదని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని వడ్లపేట వీధిలో ఇదేం కర్మ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి మహిళలకు గత పాలన చేసిన అభివృద్ధి పనులు, ఈ పాలనలో చేస్తున్న ద్రోహాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సాధించిన అభివృద్ధిని, సంక్షేమ పథకాలను గమనించాలని, టిడిపిని అధికారంలోకి తెచ్చేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఖాజా మోదీన్, గౌండా భాష, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు జడ్పీ వేణుగోపాల్, అబ్దుల్లాపురం భాష, శ్రీశైలం మాజీ దేవస్థానం అధ్యక్షుడు వంగాల శివరామిరెడ్డి, ప్రముఖ న్యాయవాది గోవిందరెడ్డి, గిరిరాజు, శివప్రసాద్ రెడ్డి, నంద్యాల జిల్లా పార్లమెంట్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు కలిముల్లా తదితరులు పాల్గొన్నారు.


ఇదేం కర్మ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

మత్తు పదార్థాలపై అవగాహన కల్పించాలి : ఎంఇఒ

ప్రజాశక్తి - పాములపాడు

మద్యం, మత్తు పదార్థాల వలన కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఎంఇఒ బాలాజీ నాయక్ అన్నారు. బుధవారం స్థానిక ఎంఆర్‌సి భవనంలో మండలంలోని పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ప్రతి పాఠశాలలో అవగాహన కల్పించేందుకు ప్రహరీ క్లబ్ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఈ కమిటీలో హెచ్‌ఎం, ఉపాధ్యాయుడు, ఇద్దరు విద్యార్థులు, ఇద్దరు విద్యార్థినీలు ఉండాలన్నారు ఈ కమిటీ ప్రతి 15 రోజులకు ఒకసారి మీటింగ్ ఏర్పాటు చేసి విద్యార్థులకు మత్తు పదార్థాల వలన కలిగే నష్టాలపై తెలియపరచాలన్నారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ నాగ రవీంద్రుడు, హెచ్‌ఎంలు సుంకన్న, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఇఒ


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

పైపులైను పనులు పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పాణ్యం

గోరుకల్లు రిజర్వాయర్ నుండి ప్యాపిలికి మంచి నీటి వసతికి నిర్మిస్తున్న పైపులైన్ నిర్మాణ పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని గోరుకల్లు రిజర్వాయర్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఇంతవరకు సగం శాతం పనులు కూడా పూర్తి కాలేదని, నిర్మాణంలో వేగం పెంచాలన్నారు. కోరారు. స్థానిక నాయకులు, రైతులు తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించారు. కార్యక్రమంలో మండలం నాయకులు సూర్య నారాయణ రెడ్డి, చందమామ బాబు, ఎంపిడిఒ దస్తగిరి పాల్గొన్నారు.

భీష్మాచార్యుడు మహోన్నత వ్యక్తి

ప్రజాశక్తి - బేతంచర్ల

మహాభారతంలో మహోన్నతమైన వ్యక్తి భీష్మాచార్యుడు అని గంగపుత్రుల సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు టైలర్ ఎల్లయ్య, రమణ అన్నారు. బుధవారం గంగపుత్రుల సంఘం కార్యాలయంలో భీష్మ ఏకాదశి పురస్కరించుకొని భీష్మచారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గంగన్న, పురుషోత్తం, మద్దిలేటి, వెంకటేశ్వర్లు, రాముడు, మహేష్, కృష్ణ, సంజీవడు, హరి తదితరులు పాల్గొన్నారు. **నంద్యాల కలెక్టరేట్ :** నంద్యాల సంజీవనగర్ రామాలయంలో వెలసిన వేంకటేశ్వర స్వామి సన్నిధిలో డా.దీవి హైగ్రీవాచారిచే విష్ణుసహస్ర నామ పారాయణం నిర్వహించారు.


మాట్లాడుతున్న ఎస్‌పి

క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి : ఎస్‌పి

నంద్యాల కలెక్టరేట్ : క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా ఎస్పీ కే రఘువీర్ రెడ్డి పోలీస్ అధికారులకు సూచించారు. బుధవారం నంద్యాల జిల్లా సాయుధ పోలీసు బలగాలు ఏర్పాటు చేసిన 'మొబిలైజేషన్' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ హాజరై మాట్లాడారు. నంద్యాల జిల్లా ఏర్పడిన తర్వాత మొదటిసారిగా ఈ మొబలైజేషన్ కార్యక్రమం ఏర్పాటు చేశామని, దీనిని జిల్లా సాయుధ పోలీసు బలగాలు సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ చంద్రబాబు, ఏఆర్ డీస్పీ సంకురయ్య, దిశ డీఎస్పీ మారుతీరావు, ఆర్ఐ పోతల రాజు, వీరన్న, సోమశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు : ఎంపిపి

నందికొట్కూర్ : సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని ఎంపిపి మురళీ కృష్ణా రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నందికొట్కూరు మండల సర్వసభ సమావేశం నిర్వహించారు. డిటీ పద్మావతి, ఎంపిడిఒ శోభారాణి, ఎఒ నాగేంద్రప్రసాద్, ఇఒఆర్‌డి సుబ్రహ్మణ్యం శర్మ, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

బేతంచర్ల : బేతంచెర్ల మండలం, పట్టణంలోని వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సిఐ ప్రియతమ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనంపై వెళ్లేవారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని తెలిపారు.

పశుగ్రాసం ట్రాక్టర్ బోల్తా

రుద్రవరం : రుద్రవరం-కొండమాయ పల్లె గ్రామాల మధ్య నంద్యాల ప్రధాన రహదారిలో పెట్రోలు బంకు సమీపంలో పశుగ్రాసం తరలిస్తున్న ట్రాక్టర్ బుధవారం బోల్తా పడింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వివరాలు.. రుద్రవరం గ్రామానికి చెందిన హుస్సేన్ మార్కాపురం సమీపంలోని మాచర్లలో బంధువులకు పశు గ్రాసాన్ని ట్రాక్టర్ ద్వారా తరలిస్తుండగా వెనక వైపు నుంచి మరో ట్రాక్టర్‌కు సైడ్ ఇవ్వడానికి వెళ్తుండగా అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో జెసిబి ద్వారా ట్రాక్టర్‌ను పక్కకు మళ్లించి వాహనాలు యథావిధిగా తిరిగేలా చేశారు.

మహిళ ఆత్మహత్య

బనగానపల్లె : మండలంలోని ఇల్లూరు కొత్తపేట గ్రామానికి చెందిన షేక్ షమినా (35) ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రామిరెడ్డి తెలిపారు. వివరాలు.. షేక్ షమీనాకు కాళ్లు సచ్చుపడడం, అనారోగ్య కారణాలతో జీవితంపై విరక్తి చెంది ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుంది. చుట్టుపక్కల వారు గమనించి మంటలను ఆర్పి చికిత్స నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కోలుకోలేక మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త ధమాల్ ఓబులేసు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమం

శ్రీశైలం : శ్రీశైలం మండలం సున్నిపెంటలోని శ్రీశైలం ప్రాజెక్టు ఉన్నత పాఠశాలలో శ్రీశైలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆత్మకూరు టిబి యూనిట్ టిబి సూపర్వైజర్ రవికుమార్ మాట్లాడుతూ క్షయ, వ్యాధి లక్షణాలు వివరించారు. విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలని, ఆటలు, వ్యాయామం చేయాలని సూచించారు. వ్యాధులు రాకుండా తీసుకోవాల్సి జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పిఎం.ప్రేమసాగర్, ఎంఎల్‌హెచ్.పి మల్లికా, హెల్త్ అసిస్టెంట్ ఇందిర ప్రభావతి, నాగేశ్వరి, ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పడకండ్లలో ఉత్సవ పల్లకి

ఆళ్లగడ్డ : మండలంలోని నాగిరెడ్డి పల్లె నుండి పడకండ్ల గ్రామ పొలిమేర తెలుపు వద్దకు లక్ష్మీ నరసింహ స్వామి పల్లకి చేరుకోగానే గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద ఎత్తున ఎదురేగి మేళ తాళాలతో స్వాగతం పలికారు. బుధవారం ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న గ్రామ తెలుపు వద్ద జ్వాల నరసింహ స్వామి, ప్రహ్లాద వరద స్వామిలకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అహోబిలేసుని ఉత్సవ పల్లకి గురువారం మధ్యాహ్నానికి ఆళ్లగడ్డ చేరుకోనుంది.

మామిడిలో యాజమాన్య పద్ధతులపై అవగాహన

చాగలమర్రి : మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో మామిడి రైతులకు ఉద్యాన అధికారి నరేష్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో యాజమాన్య పద్ధతులపై బుధవారం అవగాహన కల్పించారు. పూత, పిందె సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. విహెచ్ఏ ఉషా, ఆర్‌బికె వాలంటీరు రామాంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం : ఎంపిడిఒ

రుద్రవరం : పక్కా గృహ నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతం చేయాలని ఎంపిడిఒ మధుసూదనరెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని పేరూరు గ్రామ సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. సచివాలయ సిబ్బంది సమయపాలన తప్పనిసరిగా పాటించాలని, విధులకు హాజరు కాని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో తాగునీరు సమస్య లేకుండా చూడాలని, పారిశుధ్య పనులను చేపట్టాలన్నారు. ఇంటి పన్నులు త్వరగా వసూలు చేయాలన్నారు. అలాగే పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. హౌసింగ్ ఏఈ నాగరాజు, కార్యదర్శి శిరీష ,వర్క్ ఇన్స్పెక్టర్ ఆనంద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బైర్లూటి పిహెచ్‌సిని డాక్టర్ అనురాధ తనిఖీ

ఆత్మకూర్ : ఆత్మకూరు మండలంలోని బైర్లూటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చిన నేషనల్ హెల్త్ మిషన్ ప్రాంతీయ సహాయకురాలు డా.అనురాధ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గిరిజన ప్రాంతాల్లో గిరిజనులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రంను సందర్శించారు. గ్రామ సర్పంచ్ గురువమ్మతో ప్రతి నెలా జరిగే గ్రామీణ ఆరోగ్య పారిశుధ్య, పోషకాహార కమిటీ సమావేశం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి లోని అన్ని విభాగాలను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఓ.ప్రభావతమ్మ, డిపిఒ డాక్టర్ రేఖ, ఎంటమాలజిస్ట్ చంద్ర శేఖర్, బైర్లూటి వైద్యాధికారులు గోపాల్, పవన్ కుమార్, సిహెచ్‌ఒ మోహన్, హెల్త్ ఎడ్యుకేటర్ ధనలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

కొఠారి కమిటీకి ఆమడ దూరంలో బడ్జెట్ : యుటిఎఫ్

బనగానపల్లె : కొఠారి కమిషన్ విద్యారంగానికి జిడిపిలో ఆరు శాతం నిధులు కేటాయించాలని చెప్పినా ప్రస్తుత బడ్జెట్లో జిడిపిలో 0.3 శాతం మొత్తం బడ్జెట్లో 2.5 శాతం మాత్రమే కేటాయించడాన్ని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కె.సత్య ప్రకాశం, మండల అధ్యక్షులు ఎన్.ప్రతాప్‌లు విమర్శించారు. బుధవారం పట్టణంలోని యుటిఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ గత సంవత్సరం బడ్జెట్‌తో పోల్చుకుంటే 0.12 శాతం పెరిగినట్లు అనిపిస్తున్నా ఈ నిధులు ఏమాత్రం సరిపోవన్నారు. వేతన జీవులకు ఈ బడ్జెట్లో పన్ను మినహాయింపునకు ఎదురు చూసిన ఉద్యోగ, ఉపాధ్యాయులకి ఎలాంటి పెరుగుదల లేకపోవడం తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

స్వచ్ఛ సంకల్పంను అమలు పరచండి

శిరివెళ్ల : మండలంలోని ప్రతి గ్రామంలో జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని అమలు పరచాలని ఈఓపిఆర్‌డి సాల్మన్ రాజ్ సూచించారు. బుధవారం మండలంలోని ఎంపిడిఒ సమావేశ భవనంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం వ్యాప్తంగా సాగునీరు పుష్కలంగా ఉండడంతో వరి మాగాని సాగు చేయడం వల్ల దోమల ఉధతి అధికంగా ఉన్నట్లు ఆయా గ్రామాల నుండి సమాచారం అందిందని పేర్కొన్నారు. గ్రామంలోని ప్రతి ఓవర్ హెడ్ ట్యాంకు, తాగునీటి బోరు బావులు, స్మాల్ స్టోరేజ్ ట్యాంకులు క్రమం తప్పకుండా క్లోరినేషన్ చేయాలన్నారు. పారిశుధ్య పనులు, ఫాగింగ్ నిర్వహిస్తూ ప్రజల ఆరోగ్యానికి గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు కృషి చేయాలని కోరారు.

వార్డెన్‌కు సోషల్ వెల్ఫేర్ డిడి వత్తాసు : పిడిఎస్‌యు

నంద్యాల : అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న బొమ్మలసత్రం ఎస్సీ హాస్టల్ వార్డెన్ వెంకటేశ్వర్లుకు సోషల్ వెల్ఫేర్ డిడి చింతామణి వత్తాసు పలకడం దారుణమని పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు రాంబాబు పేర్కొన్నారు. వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం నంద్యాల పట్టణంలోని పద్మావతి నగర్ సర్కిల్‌లో పిడిఎస్‌యు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

ఆధార్ కేంద్రం సేవలను వినియోగించుకోండి

బండి ఆత్మకూర్ : ఆధార్ సేవా కేంద్రాల సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఎంపిడిఒ వాసుదేవ గుప్తా కోరారు. బుధవారం సంత జుటూరు గ్రామ సచివాలయంలో ఆధార్ సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో అడ్రస్ మార్పు, కొత్తగా నమోదు, పేరు కరెక్షన్ తదితర సేవలను అందిస్తారని, ప్రజలందరూ వినియోగించుకోవాలని తెలిపారు. సర్పంచి ఎలగల రామచంద్రుడు మాట్లాడుతూ సంత జుటూరు గ్రామ ప్రజలు ఆధార్ నమోదు సేవా కేంద్రంలో సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శేషన్న, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బోరుకు మరమ్మతులు

ప్రజాశక్తి - పగిడ్యాల

నీరు కలుషితం కాకుండా బోరుకు పగిడ్యాల కార్యదర్శి ఉపేంద్రరెడ్డి, సర్పంచు పెరుమాళ్ల శేషన్న బుధవారం మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పగిడ్యాల గ్రామ పంచాయతీ పరిధిలో కొణిదేల రోడ్డులో ఉన్న నీరు రంగు మారి వస్తున్నాయని, తెలుసుకుని మరమ్మతులు చేయించామన్నారు. బోరు బండి పిలిపించి బోరును, పైపులను పరిశీలించి రంగు నీరు రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

